ANN తెలుగు

Follow: @mahaadaily

19-12-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 360 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



వీబీ జీ రామ్ జీ బిల్లుకు

## లోక్ సభ ఆమోదం

విపక్షాల నిరసనలను పట్టించుకోని కేంద్రం

కొత్త బిల్లు ప్రతులను చించేసిన ప్రతిపక్షాలు


**మహా:** 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొస్తున్న 'వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనల మధ్యే వీబీ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం లభించింది. ఆమోద సమయంలో వెల్‌లోకి వచ్చిన విపక్ష సభ్యులు బిల్లు ప్రతులు చించి విసిరేశారు. బిల్లు ఆమోదం తర్వాత సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ కొత్త చట్టం ప్రకారం పథకం పేరు మార్చడమే కాకుండా కూలీల పనిదినాలు, రోజు వారీ వేతనం పెంచనున్నారు. 20 ఏళ్ల క్రితం అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకు వచ్చిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' స్థానంలో కొత్త చట్టం వచ్చింది. 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' బిల్లు 2025కు గురువారం లోక్‌సభలో ఆమోదం లభించింది. ప్రతిపక్షాల భారీ నిరసనలు, నినాదాల మధ్య ఈ బిల్లు ఆమోదం పొందింది.

మిగతా 2లో

టాప్ న్యూస్

### హెల్త్ కేర్ రంగంలోకి అంబానీ జియో

- వెయ్యి రూపాయలకే డీఎన్ఏ పరీక్షలు



02

### ఏపీలో జనాభా సంక్షోభం

- రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచన



02

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం

- సజ్జనార్ నేతృత్వంలో కొత్త సిట్



02

# ఈ అద్భుతాలే 2029లో రిపీట్

## 94 అసెంబ్లీ సెగ్మెంట్లకు 87 చోట్ల కాంగ్రెస్ విజయం

**6 సెగ్మెంట్ లలో బీఆర్ఎస్, ముథోల్ లో మాత్రమే బీజేపీ ఆధిక్యం**

**66 శాతం స్థానాల్లో కాంగ్రెస్.. 33 శాతం బీఆర్ఎస్ బీజేపీ కూటమికి**

**ఇవే అద్భుతం అని బీఆర్ఎస్ అంటోంది.. వచ్చే ఎన్నికల్లో జరిగేది ఇదే**

**కాంగ్రెస్ కు టూథర్డ్ మెజార్టీ పక్కా**


**పంచాయతీ ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రెస్ మీట్**

**8835 పంచాయతీల్లో కాంగ్రెస్ దే గెలుపని ప్రకటన**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో 12,702 పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 66శాతం స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ బీజేపీ కూటమి 33 శాతం స్థానాల్లో గెలిచింది. వామపక్షాలు, ఇతరులు 1శాతం గెలిచారు. ఈ ఫలితాలను చూసే అద్భుతం అనుకుంటున్నారు బీఆర్ఎస్ వాళ్ళు. చాలా సంతోషం ఈ అద్భుతాలే 2029లోనూ రిపీట్ అవుతాయి. 2/3 వంతుల మెజార్టీతో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రులతో కలిసి గ్రామపంచాయతీలపై సీఎం గురువారం సాయంత్రం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, రెబెల్స్ తో కలిపి 8335 గ్రామపంచాయతీలను కాంగ్రెస్ కైవసం చేసుకుందన్నారు. చాలా గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని, సహకరించుకున్నాయని, బీఆర్ఎస్, బీజేపీ కలిసి 33 శాతం సీట్లను గెలుచుకున్నాయని పేర్కొన్నారు. మిగిలిన 1 శాతం వామపక్షాలు, ఇతరులు గెలిచారన్నారు.

### ఆ ఏడు ఇవే

సిద్దిపేట, సిరిసిల్ల, జనగామ, సిర్పూరు, దుబ్బాక, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో మాత్రమే బీఆర్ఎస్ ఆధిక్యం సాధించిందని, బిజెపి ఒక్క ముథోల్ నియోజకవర్గంలో మాత్రమే ఆధిక్యం సాదించిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ లో కూడా కాంగ్రెస్ దే ఆధిక్యమన్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, ఆయన ఉన్నట్లు ప్రజలు కూడా భావించడం లేదన్నారు.



02



కొనసాగుతున్న

## చలి తీవ్రత

- తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- సింగిల్ డిజిట్ లో ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలు జిల్లాల్లో శీతల గాలులు వీస్తుండగా మరికొన్నిచోట్ల మంచు తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. కొన్నిచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మిగతా 2లో



## కృష్ణా జలాలపై చర్చకు సిద్ధం

మీరు చేసిన ద్రోహం ఆధారాలతో నిరూపిస్తా..

కేసీఆర్ ఎపుడు కోరితే అపుడు అసెంబ్లీ పెడతాం..

బురదజల్లి పోవడం కాదు.. దమ్ముంటే చర్చకు రండి

కేసీఆర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ ..

కేటీఆర్ నాయకత్వాన్ని మార్చాలని హరీష్ ప్రయత్నం

**హైదరాబాద్, మహా :** కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం.. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు సీఎం రేవంత్. 'కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం.' అని రేవంత్ అన్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉన్నప్పుడే ఓడించి తాము అధికారంలోకి వచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో మెజార్టీ గ్రామపంచాయతీలు గెలిచామన్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని గజ్వేల్ ప్రజలు తీర్పు ఇచ్చారని తెలిపారు.

మిగతా 2లో





నిరుద్యోగుల

## కల సాకారం

- టీజీపీఎస్సీ గ్రూప్3 ఫలితాల వెల్లడి
- 1370 మంది అభ్యర్థులతో కూడిన జాబితా విడుదల

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేస్తూ టీజీపీఎస్సీ గ్రూప్3 ఫలితాలను ప్రకటించింది. మొత్తం 1370 మంది అభ్యర్థులతో కూడిన ప్రొవిజనల్ సెలక్షన్ లిస్ట్‌ను కమిషన్ గురువారం సాయంత్రం విడుదల చేసింది.

మిగతా 2లో

బీజేపీ ఒక్క సెగ్మెంట్ లోనే..

## మళ్ళీ మొదటికి వచ్చిన పార్టీ

ముథోల్ లో తప్ప అన్నిచోట్లా వెనుకే...

నాలుగు బిజెపి స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం.. ఒక స్థానంలో బీఆర్ఎస్

**హైదరాబాద్, మహా:** బీజేపీ మళ్ళీ మొదటికి వచ్చింది. 2018 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఒకే ఒక్క స్థానం సాధించింది. 2023 ఎన్నికల్లో 8 స్థానాలు సాధించిన బీజేపీ రెండేళ్ళు తిరిగేసరికి మళ్ళీ ఒకటో నెంబర్ కు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి గురువారం గణాంకాలతో వివరించారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్క ముథోల్ నియోజకవర్గంలో మినహా ఎక్కడా బిజెపి ఆధిక్యం సాధించలేకపోయింది. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, ఆర్మూరు స్థానాల్లో కాంగ్రెస్, సిర్పూరులో బీఆర్ఎస్ ఆధిక్యం సాధించాయి. రాష్ట్రంలో 12,702 స్థానాలకు ఎన్నికలకు జరిగితే బీజేపీ కేవలం 710 స్థానాలు (5.59శాతం) మాత్రమే సాధించాయి.



మిగతా 2లో

## నాంపల్లిలో ఉద్రిక్తత

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

వివరాలు 2లో

తెలంగాణ ప్రభుత్వానికి

## రూ.15 వేల కోట్ల భూమి

సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

- తెలంగాణ ప్రభుత్వానిదే 102 ఎకరాల భూమి
- నిజాం వారసుల పిటిషన్లు కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఎనిమిది వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

**హైదరాబాద్, మహా:** వనస్థలిపురం సాహెబ్‌నగర్ సమీపంలోని 102 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ భూమిని తమదంటూ క్లెయిమ్ చేస్తున్న నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసుల వాదనలను న్యాయస్థానం తోసిపుచ్చింది. గతంలో హైకోర్టు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీల ధర్మాసనం ఈ కేసును నిశితంగా విచారించి, సదరు భూమి అటవీ శాఖకు చెందినదేనని నిర్ధారించింది. నగరానికి గుండెకాయ వంటి ప్రాంతంలో ఇంతటి విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తుల పరం చేయకుండా, అటవీ సంపదగా కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. వచ్చే ఎనిమిది వారాల్లోగా ఈ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ తీర్పుతో ప్రభుత్వ ఖజానాకు మరియు అటవీ శాఖకు భారీ విజయం చేకూరినట్లయింది.



తెలంగాణ ఆర్థిక విధానాలపై

## ఆర్బీఐ గవర్నర్ ప్రశంసలు

సీఎం రేవంత్ తో మర్యాదపూర్వక భేటీ

రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంస్కరణలతో ముందుకు వెళ్లాలని సూచన

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు , ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభినందించారు.

మిగతా 2లో



## కలిసికట్టుగా వెళ్దాం

తెలంగాణ బీజేపీ ఎంపీల నిర్ణయం.. కిషన్ రెడ్డి నివాసంలో భేటీ

**ఢిల్లీ, మహా :** ఢిల్లీలోని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి నివాసంలో తెలంగాణ ప్రాంత బీజేపీ ఎంపీలు గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ , ఎంపీలు ఈటల రాజేందర్ , డీకే అరుణ , ధర్మపురి అరవింద్ , రఘునందన్ , కొండా విశ్వేశ్వరరెడ్డి , గొడం నగేశ్ , ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, రామచంద్రరావు నేతృత్వంలో తెలంగాణలో పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో.. ప్రత్యేకమైన వ్యూహంతో పనిచేయాలని ఎంపీలు నిర్ణయించారు. పంచాయతీ ఫలితాలు షాకివ్వడం, ఇటీవల మోదీ అక్షింతల నేపథ్యంలో బీజేపీ ఎంపీల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.



## భారత్-ఒమన్ మైత్రిలో నవశకం

ప్రధానికి అత్యున్నత

పౌర పురస్కారం

- 70 ఏళ్ల స్నేహానికి అరుదైన గౌరవం
- ఒమన్‌తో చారిత్రక ఆర్థిక ఒప్పందంపై సంతకాలు
- వ్యూహాత్మక భాగస్వామ్యంలో మరో మైలురాయి
- మూడు దేశాల పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ

03



# ఈ అద్భుతాలే 2029లో రిపీట్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో 12,702 పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 66శాతం స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ బీజేపీ కూటమి 33 శాతం స్థానాల్లో గెలిచింది. వామ పక్షాలు, ఇతరులు 1శాతం గెలిచారు. ఈ ఫలితాలను చూసే అద్భుతం అనుకుంటున్నారు బీఆర్ఎస్ వాళ్ళు. చాలా సంతోషం ఈ అద్భుతాలే 2029లోనూ రిపీట్ అవుతాయి. 2/3 వంతుల మెజార్టీతో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రులతో కలిసి గ్రామపంచాయతీలపై సీఎం గురువారం సాయంత్రం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, రెబెల్స్ తో కలిపి 8335 గ్రామపంచాయతీలను కాంగ్రెస్ కైవసం చేసుకుందన్నారు. చాలా గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని, సహకరించుకున్నాయని, బీఆర్ఎస్, బీజేపీ కలిసి 33 శాతం సీట్లను గెలుచుకున్నాయని పేర్కొన్నారు. మిగిలిన 1 శాతం వామపక్షాలు, ఇతరులు గెలిచారన్నారు.

**87 అసెంబ్లీ సెగ్మెంట్ లలో కాంగ్రెస్ గెలుపు**

'94 శాసనసభ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 87 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. బీఆర్ఎస్ 6 నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలు సాధించింది. ముథోల్ నియోజకవర్గంలో మాత్రమే బీజేపీ అధిక స్థానాలు గెలిచింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 21 నియోజకవర్గాల్లో అదనంగా ఆధిక్యం సాధించాం. రెండు ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించాం. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నాం. ఈ ఎన్నికల్లో ఎలాంటి అధికారిక దుర్వినియోగానికి ప్రభుత్వం పాల్పడలేదు. పూర్తిగా స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ లో కూడా కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందన్నారు.

**రాహుల్ పై కోపంతో బీజేపీ రాజకీయం**

స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతల మాటలు వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంపై అవగాహన లేనట్లుగా బీఆర్ ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలనే తమవారు కాదని బీఆర్ఎస్ నేతలు అనటం హాస్యాస్పదమని అన్నారు. ప్రధాని మార్పు గురించి నాకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించటం దారుణమని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. కేంద్రంలోని బీజేపీ రాహుల్‌గాంధీపై కోపంతో రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. గాంధీ అనే పేరు ఎక్కడా కనిపించకూడదని కేంద్రంలోని బీజేపీ దురాలోచన అని విమర్శించారు. 2029 ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 2/3 వంతు సీట్లు, బీఆర్ఎస్‌బీజేపీకి కలిపి 1/3 వంతు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన భవిష్యత్ పొత్తుకు ఇదే నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీ బిల్లుకు లోక్ సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఈ కొత్త చట్టం ప్రకారం ఉపాధి హామీ పనిదినాలను ప్రస్తుతం ఉన్న 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం, రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభలో ఈ బిల్లు ప్రతులను చింపివేసి తమ నిరసనను తెలిపారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైనప్పటి నుంచి.. 'జీ రామ్ జీ' బిల్లుపై తీవ్ర చర్చ జరిగింది. బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఇప్పటికే దీనిపై సుదీర్ఘ చర్చ జరిగిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొనడంతో ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వెల్‌లోకి దూసుకెళ్లి.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ బిల్లు కాపీలను చింపి గాలిలోకి విసిరారు.

**కాగితాలను చింపేసేందుకు ప్రజలు ఓట్లెయ్యలేదు : స్పీకర్ ఓం బిర్లా**

దీనిపై స్పందించిన స్పీకర్ ఓం బిర్లా.. కాగితాలు చింపడానికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించి ఇక్కడికి పంపించలేదని ఎంపీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఏం జరుగుతోందో దేశ ప్రజలు గమనిస్తున్నారని మందలించారు. అనంతరం గందరగోళం మధ్యే వికసిత్ భారత్ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం లభించింది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నేత టీఆర్ బాలు, ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష నేతలు ఈ కొత్త బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరును చట్టం నుంచి తొలగించడం ఆయనను అవమానించడమేనని విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం అధిక శాతం నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు 60:40 నిష్పత్తిలో నిధుల భారం పడటం వల్ల పేద రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేవని ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ఈ చట్టం వల్ల ఉపాధి హామీ పథకం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**పాత చట్టం అవినీతికి నిలయంగా మారింది: శివరాజ్ పాటిల్**

కొత్త బిల్లును సమర్థిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. పాత చట్టం అవినీతికి నిలయంగా మారిందని.. కొత్త చట్టం పారదర్శకతను తీసుకువస్తుందని పేర్కొన్నారు. 100 రోజుల నుంచి 125 రోజులకు ఉపాధిని పెంచడం ద్వారా గ్రామీణ పేదలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అన్ని పథకాలకు జవహర్ లాల్ నెహ్రూ పేరు పెట్టిందని.. ఇప్పుడు పేర్లు మార్చడంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం పనిపైనే దృష్టి పెడుతుందని స్పష్టం చేశారు.

# కృష్ణా జలాలపై చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ నాయకత్వాన్ని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు తిరస్కరించారని చెప్పారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో కేసీఆర్‌తో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కృష్ణా, గోదావరి జలాలపై పూర్తి వివరాలతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకే ఒప్పుకుని సంతకం పెట్టిందెవరో ప్రజలకు తెలుసు అని అన్నారు. కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టుకూ కేసీఆర్ అనుమతులు సాధించలేదన్నారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై అసెంబ్లీలో చర్చిస్తాం**

మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలపైనా త్వరలో నిర్ణయం. అసెంబ్లీలో ప్రతిపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రిజర్వేషన్ల అంశాన్ని కూడా సభలో చర్చించి ముందుకెళ్తాం. కేటీఆర్ కాంగ్రెస్ గురించి కాకుండా హరీశ్‌రావు గురించి ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. హరీశ్‌రావు తన వెనకాల తవ్వుతున్నారని కేటీఆర్ ఆలోచిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక అన్ని ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోయిందని గుర్తు చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీశ్‌రావు వర్గం ఇప్పటికే ప్రచారం చేస్తోందన్నారు. కేటీఆర్ నాయకత్వాన్ని మార్చాలని హరీశ్‌రావు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. హరీశ్‌రావు ప్రయత్నాన్ని తిప్పి కొట్టేందుకే కేటీఆర్ పర్యటనలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# నాంపల్లిలో ఉద్రిక్తత

## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- బాహాబాహీకి దిగిన రెండు పార్టీల కార్యకర్తలు
- వీబీ జీ రామ్ జీ బిల్లు ఆమోదం, నేషనల్ హెరాల్డ్ కేసుపై
- బీజేపీ తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన టీ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్
- సోనియా, రాహుల్ కు మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, మహా :** కేంద్రం ప్రవేశ పెట్టిన కొత్త ఉపాధి హామీ పథకం బిల్లుపై కాంగ్రెస్ భగ్గుమంది. పథకం పేరు నుంచి మహాత్మ గాంధీ పేరును తొలగించడంపై మండిపడుతోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ ఆఫీస్‌లను ముట్టడించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ కోర్టు వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ కు క్షమాపణలు చెప్పాలంటూ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. నేరుగా కీలక కాంగ్రెస్ నేతలు రంగంలోకి దిగి బీజేపీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించడంతో నాంపల్లి పరిసర ప్రాంతాలలో సుమారు రెండు గంటల పాటు టెన్షన్ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ ముట్టడికి ప్రతిగా బీజేపీ కార్యకర్తలు కూడా గాంధీభవన్‌ను ముట్టడించేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు రెండు పార్టీల కార్యాలయాల వద్ద భారీగా మోహరించి పరిస్థితి చేయి దాటకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ కార్యాలయం చుట్టూతా భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసి పహారా కాశారు. గాంధీ భవన్ నుంచి బీజేపీ కార్యాలయానికి టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లు కార్యకర్తలతో కలిసి బీజేపీ కార్యాలయం వైపు దూసుకు వెళ్ళేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు గాంధీ భవన్ గేట్లను మూసి వేసి వారందరినీ కార్యాలయ ప్రధాన ద్వారం ముందు అడ్డుకున్నారు.

మరో వైపు రోడ్డుపై ఉన్న కార్యకర్తలు కొందరు పోలీసుల తీరును నిరసిస్తూ గాంధీ భవన్ గేట్లను తెరిచేందుకు ప్రయత్నించడంతో కొంత టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇటు గాంధీ భవన్ లో నేతలు, కార్యకర్తలను పోలీసులు నిలువరిస్తుండగానే జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తన అనుచరులతో బీజేపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఖంగుతిన్న పోలీసులు అప్రమత్తమై వారందరినీ అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. కాంగ్రెస్ నేతలు బీజేపీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నిస్తున్నారన్న విషయం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు పలువురు పార్టీ కార్యాలయానికి చేరుకుని గాంధీ భవన్ ముట్టడికి సన్నద్ధమయ్యారు. భారీ ఎత్తున కార్యకర్తలు లాఠీలను చేతబూని కాంగ్రెస్ నేతలపై దాడికి సిద్ధమని సవాల్ విసిరారు. ఒక దశలో బీజేపీ కార్యకర్తలు బారికేడ్లను ఛేదించుకుని గాంధీ భవన్ వైపు దూసుకు వెళ్ళేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారందరినీ సముదాయించి పంపించారు. సుమారు రెండు గంటల పాటు ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ కార్యకర్తలు సై అంటే సై అన్నట్లుగా పరస్పరం దాడికి సన్నద్ధం కావడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో ఆందోళనతో పోలీసులు ఇబ్బందులకు గురయ్యారు. చివరకు ఇరు పార్టీల నేతలు చర్చలు జరిపి పరిస్థితిని కొలిక్కి తీసుకు వచ్చారు.

**భారీగా ట్రాఫిక్ జాం**

బీజేపీ, కాంగ్రెస్ ల ముట్టడి ఆందోళనలతో నాంపల్లి పరిసర ప్రాంతాలలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఇటు గాంధీ భవన్, అటు బీజేపీ ప్రధాన కార్యాలయం శ్యామప్రసాద్ ముఖర్జీ భవన్ లను బారికేడ్లతో దిగ్బంధనం చేయడం, భారీగా పోలీసులు మోహరించడం, కార్యకర్తలు రోడ్లపై బైఠాయించి నినాదాలు చేయడంతో ఆ రోడ్డున వెళ్ళే వాహనదారులు నానా ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం దాదాపు గం. 11 ల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గాంధీ భవన్ పరిసర ప్రాంతాలలో వాహనదారులు నానా ఇక్కట్లకు గురవాల్సి వచ్చింది.

**జిల్లాలల్లోనూ**

ఇదే అంశంపై ఆదిలాబాద్ నుంచి ఇటు మహబూబ్‌నగర్, ఖమ్మం వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ ఆఫీస్‌లను కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. ఉపాధి హామీ పథకానికి ఉన్న గాంధీ పేరును తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేశారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాత్మ గాంధీజీ పేరును చెరిపేయాలని ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరసనలకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు కూడా నిరసనలు చేపట్టారు. పలు జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలకు రక్షణగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు నిలబడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్గొండలో తమ కార్యాలయం ముట్టడికి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులపై బీజేపీ శ్రేణులు దాడికి యత్నించడం పరిస్థితిని వేడెక్కించింది. మరో వైపు కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యాలయంపై కోడిగుట్లతో దాడికి దిగారు. పరిస్థితి మరింత విషమించకముందే పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఇలాంటి ఘటనలు తెలంగాణలోని దాదాపు అన్నిజిల్లా కేంద్రాల్లో కనిపించాయి.

**సోనియా, రాహుల్ లను వేధిస్తున్న బీజేపీ : మహేశ్ కుమార్ గౌడ్**

నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందని గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడిన టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ క్రమంలోనే సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తప్పు పట్టిందని ప్రస్తావించారు. బీజేపీ చేసిన అరాచకాలపై డీసీసీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుపుతున్నారన్నారు. తమ ముట్టడి కార్యక్రమం పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని భావించామని చెప్పారు.

**దర్యాప్తు సంస్థలతో మాకేం సంబంధం : రాంచందర్ రావు**

తమ కార్యాలయాలు ముట్టడిస్తామంటే ఊరుకునేది లేదని, ప్రతిఘటిస్తాం, తాటా తీస్తాం అంటూ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు హెచ్చరించారు. కార్యాలయాల ముట్టడులు, ధ్వంసం చేయడాలు మంచి సంస్కృతి కాదని మందలించారు. విచారణ సంస్థలకు, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏం జరిగిందన్నది విచారణ సంస్థలు, కోర్టులు చూసుకుంటాయని స్పష్టం చేశారు. బీజేపీపై నెపం వేసి, రాజకీయ పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని రాంచందర్ రావు ధ్వజమెత్తారు.

# ఏపీలో జనాభా సంక్షోభం

## రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచన

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. గురువారం అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభాపై ఆధారపడే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తగ్గుతున్న సంతానోత్పత్తి రేటుపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణకు పెద్దపీట వేసిన తాము, ఇప్పుడు జనాభాను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. "అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యనే ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నాం. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి ఉండాలి," అని సౌరభ్ గౌర్ స్పష్టం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం

## సజ్జనార్ నేతృత్వంలో కొత్త సిట్

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి కొత్త సిట్ ఏర్పాటైంది. ఈ సిట్‌కు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ నేతృత్వం వహించనున్నారు. కొత్త సిట్‌లో ఐదుగురు ఐపీఎస్‌లు సహా మొత్తం 9 మంది అధికారులు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సజ్జన్నార్ నేతృత్వంలోని కొత్త సిట్ లో సభ్యులుగా రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట సీపీ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం.రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కె.ఎస్.రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి (దర్యాప్తు అధికారి), టీజీనాబ్ డీఎస్పీ సీహెచ్.శ్రీధర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ డీఎస్పీ నాగేందర్ రావు ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఐటీయాక్ట్, పీడీపీపీ యాక్ట్, ఐపీసీ సెక్షన్ల కింద పంజాగుట్ట పీఎస్‌లో కేసు (క్రైం నంబర్ 243/2024) నమోదైంది. ఈ కేసుపై కొత్తగా ఏర్పాటైన సిట్ విచారణ చేయనుంది. ఈ కేసుకు సంబంధించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. అత్యున్నత వృత్తి నైపుణ్యాలతో విచారణ జరపాలని సూచించారు. ఐబొమ్మ కేసుతో పాటు బెట్టింగ్ కేసులను వెంటాడడంతో పాటు టెక్నాలజీతో ముడిపడి ఉన్న కేసుల ఛేదనలో సజ్జనార్ మెరిట్ చూసి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసు విచారణ వేగం పెరుగుతుందని భావిస్తున్నారు.

# కొనసాగుతున్న చలి తీవ్రత

(మొదటిపేజీ తరువాయి)

మరికొన్నిచోట్ల ఉదయం, రాత్రి సమయంలో మంచు కురుస్తోంది. ఉదయం సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఎల్లో హెచ్చరికలు జారీ**

రాబోయే రెండు రోజులు తెలంగాణలోని పలుచోట్ల శీతల గాలులు వీచే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతల గాలులు వీచే ఛాన్స్ ఉండగా... ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. శుక్రవారం ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ శీతల గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఎలాంటి హెచ్చరికలు లేవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇక హైదరాబాద్ లోని వాతావరణం చూస్తే ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచుతో కూడిన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఉపరితల గాలులు ఈశాన్య దిశలో గంటకు 46 కిమీ వేగంతో వీచే అవకాశం ఉంది.

**గజగజకు ఆదిలాబాద్ లో పాఠశాలల సమయాలు మార్పు**

మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చలి తీవ్రతకు గ గజ వణికిపోతుంది. దీంతో ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల సమయాలను సవరించింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తరగతులు ఉదయం ఆలస్యంగా ప్రారంభమవుతాయి. జిల్లాలో చలి తీవ్రత పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సమయాల్లో మార్పులు చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చలి వాతావరణం కారణంగా విద్యార్థుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడానికి ఉదయం 9 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు కాకుండా ఉదయం 9.40 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రైవేట్ పాఠశాలలతో సహా అన్ని పాఠశాలలు సమయాలను తక్షణమే పాటించాలని ఆదేశించారు. సూచనలను పాటించకపోతే తీవ్రంగా పరిగణించనున్నట్టుగా తెలిపారు.

# హెల్త్‌కేర్ రంగంలోకి అంబానీ జియో

## వెయ్యి రూపాయలకే డీఎన్ఏ పరీక్షలు

**మహా :** మరో భారీ విప్లవానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రెడీ అవుతున్నారు. టెలికాం రంగంలో అతి తక్కువ ధరకే డేటాను అందించి 'జియో'తో చూసిన సక్సెస్ మళ్లీ హెల్త్ కేర్ రంగంలో కూడా రిపీట్ చేయాలని డిసైడ్ అయ్యారు. ప్రాణాంతక వ్యాధులను ముందే గుర్తించే 'జెనోమిక్ టెస్టింగ్' ధరలను భారీగా తగ్గించి, సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని రిలయన్స్ గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం మార్కెట్లో రూ.10వేల కంటే ఎక్కువగా ఉన్న ఈ పరీక్షల ధరను ఏకంగా రూ.వెయ్యి కంటే తక్కువకు అందించాలని అంబానీ ప్లాన్ చేస్తున్నారు. జెనోమిక్ పరీక్షలు అంటే ఒక వ్యక్తి జన్యుక్రమాన్నిడీఎన్ఏ విశ్లేషించడం. మన శరీరంలో భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి మొండి వ్యాధుల ముప్పును ఈ పరీక్షల ద్వారా ముందే పసిగట్టవచ్చు. ఇప్పటివరకు ఈ పరీక్షలు అత్యంత ఖరీదైనవి కావడంతో కేవలం సంపన్న వర్గాలకే పరిమితమయ్యాయి. అయితే రిలయన్స్ తన అనుబంధ సంస్థ 'స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్' ద్వారా ఈ రంగంలోకి ప్రవేశించి, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి పరీక్షల వ్యయాన్ని 90% వరకు తగ్గించనుంది. భారత్ లాంటి భారీ జనాభా కలిగిన దేశంలో ఈ సేవలకు మంచి డిమాండ్ ఉంటుందని అంబానీ అంచనా వేస్తున్నారు. అయితే రేటే ఇక్కడ అన్నింటి కంటే ముఖ్యమైనది కావటంతో మరోసారి టెలికాం, బెవరేజెస్ రంగాల్లో లాగా పోటీని దాటి విజయం సాధించటానికి కొత్త వ్యూహంతో ఆరోగ్య రంగంలోకి ఎంట్రీకి అంబానీ యత్నిస్తున్నారు. ఈ జెనోమిక్ టెస్టింగ్ అందుబాటులోకి వస్తే సామాన్యులు కూడా తమ ఆరోగ్య స్థితిగతులను ముందే తెలుసుకునే అవకాశం ఉంటుంది.

# బీజేపీ ఒక్క సెగ్మెంట్ లోనే.. మళ్ళీ మొదటికి వచ్చిన పార్టీ

## ముథోల్ లో తప్ప అన్నిచోట్లా వెనుకే...

### నాలుగు బిజెపి స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం.. ఒక స్థానంలో బీఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ పట్ల తెలంగాణ ప్రజల మారిన ధోరణికి, కాంగ్రెస్ కు పెరిగిన ఆదరణకు ఈ ఫలితాలే నిదర్శనమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో బీజేపీ పరిస్థితిపై ఇటీవల మోదీ చేసిన వ్యాఖ్యలు తాజా పరిస్థితికి అద్దం పడతాయి. గ్రౌండ్ లో పూర్తిగా తేలిపోయిందని ఇటు ఫలితాలు, అటు హైకమాండ్ రెండూ తేల్చిచెప్పేశాయని పరిశీలకులు అంటున్నారు. బిజెపికి బలమైన ప్రాంతాలుగా చెప్పుకున్న ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనూ ప్రజలు తిరస్కరించిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. నేతల మధ్య ఐక్యత లోపం, సమన్వయ లోపం, ఒకరంటే ఒకరికి పొసగకపోవడం వెరసి ఆ పార్టీపై ప్రజలు పెట్టుకున్న అంచనాలు తప్పడంతో ప్రజలు ఈ తరహా తీర్పునిస్తున్నారన్న విశ్లేషణలున్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఎన్నికలో బిజెపికి డిపాజిట్ కూడా గల్లంతు కాగా, ఇది కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గంలోనిది కావడం గమనార్హం. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బిజెపి తిరోగమనంలో ఉందని చెబుతున్నారు.

# 2 గంటలకు బాంబు పేలుతుంది

## నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు.. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెసేజ్

**హైదరాబాద్, మహా :** నగరంలోని నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టు ప్రాంగణంలో బాంబు పేలుతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను కోర్టు నుంచి బయటకు పంపించి, బాంబు నిర్వీర్య దళాలతో తనిఖీలు చేపట్టారు. కోర్టు లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చిన ఈ బెదిరింపు సందేశంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# నిరుద్యోగుల కల సాకారం

## టీజీపీఎస్సీ గ్రూప్3 ఫలితాల వెల్లడి.. 1370 మంది అభ్యర్థులతో కూడిన జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం నిర్వహించిన ఈ పరీక్షా ఫలితాల కోసం అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూశారు. పరీక్షా నిర్వహణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోనూ పారదర్శకతను పాటిస్తూ, మెరిట్ ప్రాతిపదికన ఈ ఎంపికలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను, వారి హాల్ టికెట్ నంబర్లను కమిషన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఫలితాలను చూసుకున్న అభ్యర్థులు తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో కొత్త రక్తం ప్రవహించడమే కాకుండా, పరిపాలనలో మరింత వేగం వస్తుందని భావిస్తున్నారు. ఎంపికైన వారు తదుపరి ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం సిద్ధంగా ఉండాలని కమిషన్ సూచించింది.

# భారత్-ఒమన్ మైత్రిలో నవశకం

## ప్రధానికి అత్యున్నత పౌర పురస్కారం

- 70 ఏళ్ల స్నేహానికి అరుదైన గౌరవం
- ఒమన్‌తో చారిత్రక ఆర్థిక ఒప్పందంపై సంతకాలు
- వ్యూహాత్మక భాగస్వామ్యంలో మరో మైలురాయి
- మూడు దేశాల పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ



**ఢిల్లీ, మహా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన మూడు దేశాల పర్యటన అత్యంత కీలకమైన విజయాలతో ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా భారత్, ఒమన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రక ఆర్థిక ఒప్పందాలు ఇరు దేశాల భవిష్యత్తును మార్చనున్నాయి. ఏడు దశాబ్దాల సుదీర్ఘ దౌత్య బంధానికి గుర్తుగా ఒమన్ ప్రభుత్వం మన ప్రధానికి తన దేశపు అత్యున్నత గౌరవాన్ని అందజేసింది. కేవలం వాణిజ్యం మాత్రమే కాకుండా రక్షణ మరియు ఇంధన రంగాలలో కూడా భారత్ తన పట్టును నిరూపించుకుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన జోర్డాన్, ఇథియోపియా మరియు ఒమన్ పర్యటనలు దేశ విదేశాంగ విధానంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించాయి. ముఖ్యంగా పర్యటన చివరి దశలో ఒమన్ చేరుకున్న ప్రధానికి ఆ దేశ ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కీలక సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా భారతీయ వస్తువులు ఒమన్ దేశంలో ఎటువంటి అదనపు సుంకాలు లేకుండా విక్రయించే అవకాశం కలుగుతుంది. ఇది మన దేశ రైతులు, చిన్న వ్యాపారులు మరియు ఎగుమతిదారులకు ఎంతో మేలు చేస్తుంది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఒమన్ దేశం మరొక దేశంతో కుదుర్చుకున్న మొట్టమొదటి అతిపెద్ద ఒప్పందం ఇదే కావడం విశేషం. ఈ పర్యటనలో మరో ప్రధాన ఘట్టం ఏమిటంటే, భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి డెబ్బై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనే అత్యున్నత పౌర పురస్కారాన్ని ఆ దేశ సుల్తాన్ హైతం బిన్ తారిక్ స్వయంగా అందజేశారు. ఇరు దేశాల మధ్య మైత్రిని బలోపేతం చేయడంలో భారత ప్రధాని చూపిన నాయకత్వానికి, దూరదృష్టికి ఇది నిదర్శనంగా నిలిచింది. కేవలం వాణిజ్యమే కాకుండా రక్షణ, సముద్ర భద్రత, ఇంధనం, వ్యవసాయ రంగాల్లో కూడా పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని ఇరుపక్షాలు నిర్ణయించుకున్నాయి. ముఖ్యంగా అరేబియా సముద్ర తీర ప్రాంతాల్లో భద్రత విషయంలో భారత్ మరియు ఒమన్ కలిసి పనిచేయడం వ్యూహాత్మకంగా చాలా ముఖ్యం. గత కొన్నేళ్లుగా భారత్ అనేక దేశాలతో ఇటువంటి వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంటూ తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ఆస్ట్రేలియా, బ్రిటన్ మరియు ఇతర అరబ్ దేశాలతో జరిగిన ఒప్పందాల వల్ల ఇప్పటికే మన ఎగుమతులు భారీగా పెరిగాయి. ఒమన్‌తో కుదిరిన తాజా ఒప్పందం వల్ల మన దేశంలోని ఔషధాలు, యంత్ర పరికరాలు మరియు వ్యవసాయ ఉత్పత్తులకు గల్ఫ్ దేశాల్లో గిరాకీ మరింత పెరగనుంది. అలాగే ఒమన్‌లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల సంక్షేమం, వారి ఉద్యోగ భద్రత, వీసా సౌకర్యాల సరళీకరణపై కూడా ఈ పర్యటనలో సానుకూల చర్చలు జరిగాయి. అంతకుముందు జోర్డాన్ పర్యటనలో పునరుత్పాదక ఇంధనం, నీటి వనరుల నిర్వహణపై కుదిరిన ఒప్పందాలు కూడా దేశాభివృద్ధికి ఎంతో తోడ్పడనున్నాయి. భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగబోతోందని, ఈ ప్రయాణంలో స్నేహపూర్వక దేశాల సహకారం ఎంతో అవసరమని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఒమన్‌తో కుదిరిన ఈ చారిత్రక ఒప్పందం రాబోయే కాలంలో రెండు దేశాల ఆర్థిక అభివృద్ధికి , ప్రజల మధ్య సంబంధాలకు కొత్త దిశను చూపుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ తన ప్రాబల్యాన్ని మరింతగా పెంచుకుంది.

### పదిహేనేళ్ల సమస్యను పది రోజుల్లో పరిష్కరించిన మండల

# లీగల్ సర్వీస్ చైర్మన్ డాక్టర్ ఎం రాధాకృష్ణ చౌహాన్



**సూర్యాపేట జిల్లా మహా:** పదిహేనేళ్లుగా ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలకు దూరమై అధికారుల చుట్టూ కాళ్ల ఏళ్లబడి కోరినా అందని సాయాన్ని,హుజూర్ నగర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం రాధాకృష్ణ చౌహాన్ ను సంప్రదించిన వారం రోజుల్లోనే సమస్యను పరిష్కరించిన చైర్మన్ కు వృద్ధురాలు మేడి మట్టమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. వివరాల్లో కెళితే సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం లింగగిరి కి చెందిన మేడి రాములు మట్టమ్మ దంపతులు వీరికి ఏకైక కుమార్తె కాంతమ్మ ఆమెను గరిడేపల్లి మండలం కాల్వపల్లికి చెందిన దివ్యాంగుడు సైదులుకు ఇచ్చి వివాహం చేశారు.మట్టమ్మకు చిన్నప్పటి నుంచే చూపు లేకపోవడంతో భర్త ఆలనాపాలనా చూసేవాడు. ఆయనకు 2000 సంవత్సరం నుంచి పింఛన్ వచ్చేది. రేషన్ బియ్యంతో పాటు, పింఛన్ సొమ్ము,కూలీ పనులు చేస్తూ ఉన్నంతలో జీవనం సాగించేవారు. భర్త రాములు మృతితో పింఛన్ సాయం,రేషన్ బియ్యం ని లిచిపోవడంతో ఆమె కష్టాలు పెరిగాయి.తల్లి పోషణ కోసం కూతురు,అల్లుడు లింగగిరికి వచ్చి జీవిస్తున్నారు. సైదులు దివ్యాంగుడు కావడంతో పనిచేయలేని పరిస్థితి. కూతురు కాంతమ్మ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ వచ్చిన కొద్దిపాటి మొత్తంతో ముగ్గురిని పోషిస్తోంది. కళ్లు కనిపించని కారణంగా ఐరిస్ గుర్తించకపోవడం, చేతివేళ్ల గుర్తులు చెరిగిపోవడంతో ఆమెకు ఆధార్ మంజూరు కావడం లేదు.ఆధార్ కార్డు ఉంటేనే భర్త పింఛన్ న్ను ఆమెకు బదలాయించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆధార్ కోసం జిల్లా కేంద్రంతో పాటు పలు మీసేవా తిరిగినా ఫలితం కనిపించలేదని అధికారులు చొరవ తీసుకుని ప్రత్యేకంగా భావించి పింఛన్, రేషన్ మంజూరు చేయాలని కాంతమ్మ ప్రాధేయపడినా జాలి చూపించిన అధికారులు లేరు. భర్త పెన్షన్ రాక, ఆధార్ లేక రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ ప్రభుత్వ పథకాలకు దూరమైంది. చివరకు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టి జే ఏ) సూర్యాపేట జిల్లా కమిటీ ని ఆశ్రయించడంతో హుజూర్ నగర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం రాధాకృష్ణ చౌహాన్ వద్ద ఆమెను ప్రవేశపెట్టడంతో మానవతా దృకృథంతో స్పందించిన డా.ఎంరాధాకృష్ణ చౌహాన్ యుఐ డి హైదరాబాద్, జిల్లా కలెక్టర్, డి.ఎస్.ఓ,డి ఆర్ డి ఓ,డిపిఓ,ఆర్డీవో ఎంపీడీవో, బీఎండబ్ల్యూ, పంచాయతీ సెక్రెటరీ నోటీసులు జారీ చేయడంతో పది రోజుల్లోనే అధికారులు అందరూ హుజూర్ నగర్ కోర్టుకు హాజరై ఆమెకు ఆధార్ కార్డు అందజేయడం జరిగింది. పది,పదిహేనేళ్లుగా ఆధార్ కార్డు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డానని నేటి వరకు ప్రభుత్వ పథకాలు తనకు అందలేదని ఆధార్ కార్డు ఇప్పించిన న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం రాధాకృష్ణ చౌహాన్ కు, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యులకు, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### గణతంత్ర వేడుకల్లో

# సరికొత్త అధ్యాయం

## ముఖ్య అతిథులుగా యూరోపియన్ యూనియన్ అగ్రనేతలు

వాణిజ్య ఒప్పందమే లక్ష్యంగా.. భారత గణతంత్ర వేడుకలకు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ఆంటోనియో కోస్టా

తొలిసారిగా ఒకే వేదికపైకి రిపబ్లిక్ డే అతిథులుగా ఈయూ ప్రతినిధులు



**ఢిల్లీ, మహా:** భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఒక అరుదైన ,చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానున్నాయి. ప్రతి ఏటా ఒక దేశాధినేతను మాత్రమే ఆహ్వానించే ఆనవాయితీకి భిన్నంగా, ఈసారి ఒక శక్తివంతమైన అంతర్జాతీయ కూటమికి చెందిన ఇద్దరు కీలక నాయకులను భారత ప్రభుత్వం ఆహ్వానించినట్లు తెలుస్తోంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈ వేడుకల్లో పాల్గొనడం ద్వారా భారత్, ఐరోపా సమాఖ్య మధ్య ఉన్న బలమైన సంబంధాలను ప్రపంచానికి చాటిచెప్పనున్నారు సాధారణంగా ఒకే దేశాధినేతను ఆహ్వానించే సంప్రదాయం ఉండగా, ఈసారి యూరోపియన్ యూనియన్ వంటి బహుళ దేశాల కూటమి నాయకులను ఎంపిక చేయడం వెనుక లోతైన రాజకీయ మరియు ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య మారుతున్న వాణిజ్య పరిణామాల నేపథ్యంలో, ఐరోపా సమాఖ్యతో భారత్ బంధం మునుపెన్నడూ లేనంత ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే ఏడాది జనవరిలో న్యూఢిల్లీ వేదికగా భారత్‌ఈయూ సమ్మిట్ జరగనుంది. ఈ శిఖరాగ్ర సమావేశం ముగిసిన వెంటనే, ఈయూ అగ్రనేతలు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాలుపంచుకోనున్నారు. ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 'ఉచిత వాణిజ్య ఒప్పందం' పై ఈ పర్యటనలో ఒక స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. అమెరికా ఆర్థిక విధానాల్లో వస్తున్న మార్పుల వల్ల భారత్ తన ఎగుమతుల కోసం ఐరోపా మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఈయూ ట్రేడ్ కమిషనర్ మరోస్ కూడా ఒప్పందంపై సానుకూల సంకేతాలు ఇచ్చారు. భారత్ , యూరోపియన్ యూనియన్ మధ్య కేవలం వాణిజ్యమే కాకుండా, రక్షణ, సాంకేతికత, వాతావరణ మార్పుల వంటి అంశాల్లో కూడా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. ఈ ఆహ్వానం ద్వారా ఐరోపా ఖండంలోని 27 దేశాలతో సంబంధాలను ఒకేసారి బలోపేతం చేసుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈయూ అగ్రనేతల రాకతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రాబల్యం మరింత పెరుగుతుందని, ముఖ్యంగా రక్షణ రంగంలో ఐరోపా సాంకేతికత భారత్‌కు మరింత చేరువయ్యే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఉపాధి హామీలో అవినీతికి చెక్

**హైదరాబాద్, మహా:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ఉద్దేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అక్రమాలు దీని లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పనులు చేయకుండానే వేతనాలు పొందడం, అనర్హుల పేరిట నిధులు డ్రా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపు నిష్పత్తిని 90:10 నుండి 60:40కి మార్చడం వెనుక బలమైన కారణం కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులను భారీగా వెచ్చించాల్సి వచ్చినప్పుడు, ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా నిఘా పెంచుతాయని, తద్వారా వ్యవస్థలో అవినీతి తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### నిధుల వాటా పెంపు.. బాధ్యతాయుత పర్యవేక్షణ

గతంలో కేంద్రం 90 శాతం నిధులు సమకూర్చడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో జరిగే చిన్నపాటి అక్రమాలను పెద్దగా పట్టించుకునేవి కావు. కానీ, ఇప్పుడు రాష్ట్రం తన ఖజానా నుండి 40 శాతం నిధులను భరించాల్సి రావడం వల్ల, పర్యవేక్షణ యంత్రాంగం మరింత అప్రమత్తం కానుంది. సొంత రాష్ట్ర బడ్జెట్ ప్రభావితం అవుతున్న తరుణంలో, ఎక్కడ పనులు జరుగుతున్నాయి, ఎవరికి వేతనాలు వెళ్తున్నాయి అనే అంశంపై కలెక్టర్ల నుండి పంచాయతీ కార్యదర్శుల వరకు అందరిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది సహజంగానే అక్రమాలకు తావులేకుండా చేస్తుంది.

### దొంగ హాజరు, బోగస్ కార్డుల నిర్మూలన

గ్రామీణ ప్రాంతాల్లో పనికి రాకుండానే హాజరు వేయించుకోవడం, ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తూ ఇక్కడ ఉపాధి హామీ వేతనం పొందడం వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. కేంద్రం కొత్తగా ప్రవేశపెడుతున్న బయోమెట్రిక్ ధ్రువీకరణ మరియు జియోస్పేషియల్ టెక్నాలజీ ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయనున్నాయి. పని ప్రదేశంలో కూలీలు భౌతికంగా ఉన్నప్పుడే జియో ట్యాగింగ్ ద్వారా ఫోటోలు తీయడం, బయోమెట్రిక్ వేయడం వల్ల కాగితాల మీద పనులు చూపి నిధులు కాజేసే పరిస్థితి ఉండదు. టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా అమలు చేస్తేనే వారికి కేంద్రం నుండి వాటా నిధులు విడుదలవుతాయి కాబట్టి, తప్పనిసరిగా పారదర్శకత పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

### పక్కాగా క్షేత్రస్థాయి పనులు

ఉపాధి హామీ నిధులు కేవలం వేతనాలకే కాకుండా, గ్రామీణ ఆస్తుల కల్పనకు ఉపయోగపడాలి. గతంలో నిధుల దుర్వినియోగం వల్ల పనులు నాసిరకంగా ఉండటం లేదా అసలు పనులే జరగకపోవడం వంటివి ఉండేవి. ఇప్పుడు 60:40 నిష్పత్తి వల్ల మెటీరియల్ ఖర్చులో కూడా రాష్ట్రాల భాగస్వామ్యం పెరుగుతుంది. దీంతో నిర్మించే కట్టడాల నాణ్యతపై స్థానిక యంత్రాంగం దృష్టి సారిస్తుంది. అదనపు భారం పడుతుందన్న భయంతోనైనా, రాష్ట్రాలు అనర్హులను తొలగించి, నిజమైన కూలీలకు మాత్రమే పని కల్పించే దిశగా అడుగులు వేస్తాయి.

### సంస్కరణల సత్ఫలితం

ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పారదర్శకత అత్యవసరం. నిధుల కేటాయింపులో కేంద్రం చేసిన మార్పులు మొదటి చూపులో రాష్ట్రాలపై ఆర్థిక భారంగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది వ్యవస్థను ప్రక్షాళన చేసే అవకాశం ఉంది. రాజకీయ పక్షపాతం లేకుండా, కేవలం పని చేసిన వారికే డబ్బులు అందేలా చేయడంలో ఈ నూతన విధానం కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సవాలును స్వీకరించి, కఠినమైన తనిఖీలు నిర్వహిస్తే ఉపాధి హామీ పథకం మళ్ళీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది.

### తెలంగాణ ఆర్థిక విధానాలపై

# ఆర్బీఐ గవర్నర్ ప్రశంసలు

సీఎం రేవంత్ తో మర్యాదపూర్వక భేటీ

రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంస్కరణలతో ముందుకు వెళ్లాలని సూచన



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణను పాటించడంతో పాటు వృద్ధి దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులను ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆర్ బిఐ గవర్నర్ మల్హోత్రా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో తాము తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు మూడవ విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఖర్చును తగ్గించుకునే దిశగా సౌర విద్యుత్ వినియోగాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెంచేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అక్రమంగా డిపాజిట్లు సేకరించి ప్రజలను మోసగించే సంస్థల నుండి సామాన్యులను రక్షించేందుకు 'బడ్స్' చట్టాన్ని అధికారికంగా నోటిఫై చేయాలని ఆర్బీఐ గవర్నర్ ముఖ్యమంత్రిని కోరారు. ప్రజల కష్టార్జితానికి రక్షణ కల్పించే ఈ చట్టం అమలు అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. దీనితో పాటు రిజర్వ్ బ్యాంక్ కొత్తగా ప్రవేశపెట్టిన సమగ్ర రుణ అనుసంధాన ప్రక్రియ గురించి, తద్వారా సామాన్యులకు సులభంగా రుణాలు అందే విధానంపై సీఎంకు వివరించారు. బ్యాంకుల్లో క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన డిపాజిట్ల విషయంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రచార కార్యక్రమాలను కూడా ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంస్కరణలతో ముందుకు వెళ్లాలని, ఇందుకు కేంద్ర బ్యాంక్ తరపున పూర్తి సహకారం ఉంటుందని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. వీరితో పాటు ఆర్బీఐ ప్రాంతీయ సంచాలకులు చిన్మోయ్ కుమార్, ప్రధాన నిర్వాహకులు మేజర్ యశ్పాల్ చరణ్, పాణిగ్రాహి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 95 ఏళ్ల రికార్డు బద్ధలు

## టెస్ట్ క్రికెట్‌లో కివీస్ ఓపెనర్ల చారిత్రక ఘనత

- డబ్ల్యూటీసీ చరిత్రలోనే అత్యుత్తమ ఓపెనింగ్ జోడీగా లాథమ్ - కాన్వే రికార్డు
- భారత ఓపెనర్ల రికార్డును చెరిపేసిన న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్లు
- వెస్టిండీస్‌పై విరుచుకుపడ్డ కివీస్ బ్యాటర్లు, సెంచరీలతో చెలరేగిన ఓపెనర్లు
- ఓవల్ వేదికగా పరుగుల సునామీ.. రికార్డుల వేటలో టామ్ లాథమ్, డెవాన్ కాన్వే




**హైదరాబాద్, మహా:** న్యూజిలాండ్ గడ్డపై జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే విశ్వరూపం ప్రదర్శించారు. వెస్టిండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఈ జోడీ తొలి వికెట్‌కు ఏకంగా 323 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు చేసిన జోడీగా నిలవడమే కాకుండా, 95 ఏళ్ల నాటి పాత రికార్డును కూడా కనుమరుగు చేసింది.

**రికార్డుల వేటలో లాథమ్ .. కాన్వే జోడీ**

వెస్టిండీస్‌తో ఓవల్ వేదికగా ప్రారంభమైన ఈ నిర్ణయాత్మక పోరులో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ నిర్ణయాన్ని సరైనదే అని నిరూపిస్తూ కెప్టెన్ టామ్ లాథమ్, స్టార్ ఓపెనర్ డెవాన్ కాన్వే క్రీజులో పాతుకుపోయారు. వీరిద్దరూ కలిసి 520 బంతులు ఎదుర్కొని 323 పరుగులు జోడించారు. ఇప్పటివరకు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో తొలి వికెట్‌కు టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ పేరిట ఉన్న 317 పరుగుల (దక్షిణాఫ్రికాపై 2019లో) రికార్డును లాథమ్‌కాన్వే జంట అధిగమించింది. కేవలం డబ్ల్యూటీసీ రికార్డు మాత్రమే కాకుండా, న్యూజిలాండ్ స్వదేశీ టెస్ట్ క్రికెట్ చరిత్రలో 95 ఏళ్లుగా అజేయంగా ఉన్న రికార్డు కూడా నేడు బద్దలైంది. 1930లో ఇంగ్లాండ్‌పై ఛార్లెస్ స్టెవర్ట్ డెంప్స్టర్, జాన్ ఎర్నెస్ట్ మిల్స్ నెలకొల్పిన 276 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యమే ఇప్పటివరకు కివీస్ గడ్డపై అత్యుత్తమంగా ఉండేది. దాదాపు ఒక శతాబ్దం తర్వాత ఆ రికార్డును లాథమ్‌కాన్వే జోడి తిరగరాశారు.

### మైదానంలో పరుగుల వరద

కెప్టెన్ టామ్ లాథమ్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ 246 బంతుల్లో 137 పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. లాథమ్ 86.4 ఓవర్ల వద్ద రోచ్ బౌలింగ్‌లో వెనుతిరిగినప్పటికీ, అప్పటికే జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. మరోవైపు డెవాన్ కాన్వే మరింత దూకుడుగా ఆడుతూ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 178 పరుగులతో అజేయంగా నిలిచాడు. కాన్వే తన సుదీర్ఘ ఇన్నింగ్స్‌లో విండీస్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. రెండో రోజు ఆటలో అతను డబుల్ సెంచరీ మార్కును చేరుకునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 334 పరుగులు చేసింది. క్రీజులో కాన్వేతో పాటు నైట్ వాచ్‌మన్ జేకబ్ డఫీ (9) ఉన్నాడు. న్యూజిలాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో వెస్టిండీస్‌పై 1972లో గ్లెన్ టర్నర్, టెర్రీ జార్విస్ నెలకొల్పిన 387 పరుగుల భాగస్వామ్యం తర్వాత ఇదే అత్యుత్తమ ఓపెనింగ్ స్టాండ్ కావడం విశేషం. ఈ భారీ స్కోరుతో న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించడమే కాకుండా సిరీస్ క్లీన్ స్వీప్ దిశగా అడుగులు వేస్తోంది.

# ప్రేమ వివాహంలో పెను విషాదం

### అదనపు కట్నం కోసం

## నవవధువు హత్య

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి
- ప్రేమను మరిచిన పశువు.. కన్నవారింటికి వెళ్తున్న భార్యను బలవంతంగా తెచ్చి హత్య
- అనుష మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతం



**హైదరాబాద్, మహా:** ప్రేమ వివాహం చేసుకున్న ఎనిమిది నెలలకే ఒక పచ్చని సంసారం అదనపు కట్నం వేధింపుల కారణంగా బూడిదయ్యింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో భర్త, అత్తమామల వేధింపుల తట్టుకోలేక, చివరకు భర్త చేతిలోనే తీవ్రంగా గాయపడి ఒక యువతి ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. తాండూరు పట్టణం సాయిపూర్ ప్రాంతంలో నివసించే పరమేష్, అనుష (22) ఎనిమిది నెలల క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వివాహం జరిగిన కొద్ది రోజుల నుంచే పరమేష్ తన అసలు రంగు బయటపెట్టాడు. అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే గత గురువారం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనుషను తన సోదరుడు పుట్టింటికి తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించగా, పరమేష్ అడ్డుకుని ఆమెను తిరిగి గదిలోకి తీసుకువెళ్ళి పాశవికంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అనుష అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. స్థానికుల సహాయంతో ఆమెను ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. అనుష మరణంతో ఆమె కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కట్నం కోసం ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిన పరమేష్‌ను, వేధించిన అత్తమామలను కఠినంగా శిక్షించాలని బాధితురాలి తరపు బంధువులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

EDITORIAL
సంపాదకీయం

# బాదేస్తా.. ఆపేస్తా.. ఇదే ట్రంప్ విధానం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరించడం, బాదడం, ఆపడం అనే విధానాలతో ముందుకుసాగుతున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైంది మొదలు ఇప్పటిదాకా ప్రజలకు మేలు కలిగే నిర్ణయాలు తీసుకున్నది లేదు. తన వ్యక్తిగత వ్యాపారాలు పెంచుకున్నారు కానీ అమెరికన్లకు ఒరిగిందేమీ లేక ఎన్నడూ లేనంత దారుణ ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేశారు. ఇపుడు ట్రావెల్ బ్యాన్ వెంట పడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించిన ట్రావెల్ బ్యాన్‌ను ఇపుడు మరింత విస్తరించారు, మరో 20 దేశాలపై నిషేధాలు పరిమితుల విధించింది. వాటిలో 5దేశాలపై పూర్తిగా ప్రవేశం నిషేధం విధించగా, మరో 15 దేశాల పౌరులపై పాక్షిక పరిమితులు విధించింది. అమెరికా ప్రయాణం, వలసల ప్రవేశ ప్రమాణాలను కఠినతరం చేసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్‌లో 12దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధం విధించారు. ఫ్గానిస్థాన్, మయన్మార్, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ దేశాల పౌరులు అమెరికాలోని ప్రవేశాన్ని నిషేధించారు. ఇప్పుడు మరో ఏడు దేశాలు బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, టర్క్‌మెనిస్తాన్, వెనెజువెలా దేశాలపై పరిమితులు విధించారు. తాజాగా ఆ జాబితాలో బుర్కినోఫాసో, మాలి, నైజర్, దక్షిణ సూడాన్, సిరియాను చేర్చారు. పాలస్తీనాఅథారిటీ జారీచేసిన ప్రయాణపత్రాలు వారిపై కూడా అమెరికా ప్రయాణ నిషేధం విధించింది. పాక్షిక ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో మరో 15 చేర్చనున్నట్లు తెలిపింది. పాలస్తీనా అథారిటీ పాస్‌పోర్ట్ కలిగిన వారికి ఇప్పటికే వ్యాపారం, ఉద్యోగం, విద్య, పర్యటన కోసం అమెరికా రావడం దాదాపు అసాధ్యంగా మారింది. తాజా ప్రకటనతో అమెరికాకు వలస వెళ్లకుండా పూర్తిస్థాయి నిషేధం అమలులోకి వచ్చింది. అయితే ఈ నిషేధం వర్తించని వారు కూడా ఉన్నారు. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగినవారు, గ్రీన్‌కార్డు హోల్డర్స్, దౌత్యవేత్తలు, క్రీడాకారులు వంటి కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీలకు చెందినవారు, అమెరికా జాతీయ ప్రయోజనాలకు ఉపయోగపడతారని భావించిన వ్యక్తులకు మినహాయింపులు ఉంటాయని తెలిపింది. ఇవి జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. అమెరికా ప్రవేశ ప్రమాణాలు, వలస విధానాలను మరింత కఠినతరం చేయడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నామని ట్రంప్ సర్కార్ పేర్కొన్నారు. అయితే విమర్శకులు మాత్రం, ఇది అన్యాయంగా అనేక దేశాల ప్రజలను అమెరికాకు దూరం చేస్తోందని ఆరోపిస్తున్నారు. నిషేధం విధించిన దేశాల్లో అవినీతి, నకిలీ పౌర పత్రాలు, సరైన క్రిమినల్ రికార్డుల వంటి అంశాలు అమెరికా భద్రతా తనిఖీలను బలహీనపరుస్తున్నాయని వైట్ హౌస్ వెల్లడించింది. అలాగే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా స్వదేశాలకు తిరిగి వెళ్లకుండా అమెరికాలో ఉండటం, తమ పౌరులను తిరిగి తీసుకెళ్లకపోవడంలో ప్రభుత్వాలు సహకరించకపోడం వంటి కారణాలను వివరించింది.



## విదేశీ వలసలను తగ్గించా..

తాను ఈ ఏడాది జనవరిలో దేశ అధ్యక్షుడు అయినప్పటి నుంచి బార్డర్‌లో సెక్యూరిటీని పెంచి అక్రమ వలసలను అరికట్టానని ట్రంప్ చబుతున్నారు. వైట్ హౌజ్ లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విదేశీ వలసలను తగ్గించడంలో సక్సెస్ అయినట్లు వెల్లడించారు. మిన్నెసోటా రాష్ట్రంలో పెద్దసంఖ్యలో సోమాలియా వలసదారులు ఉన్నారని ట్రంప్ పేర్కొన్నారు. అక్కడి ఆర్థిక వ్యవస్థపై ఆ వలసదారులు బలమైన పట్టు సాధించారని ఆయన చెప్పారు. దేశానికి ప్రయోజనం కలిగించే, దేశభక్తి కలిగిన, శ్రమించే అమెరికా పౌరులు లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘించే, మోసపూరితంగా వ్యవహరించే, అధికారం, లాభం కోసం పాకులాడే వాళ్లలో కేవలం ఎవరో ఒకరికే ప్రభుత్వం సేవ చేస్తుందన్నారు. ఇలా ట్రంప్ అంటేనే టారిఫ్ అని, వలసలకు బ్రేక్ అని చెబుతున్నారు. ఆర్థికవ్యవస్థను మాత్రం పునరుద్ధరించలేకపోతున్నారన్న అభిప్రాయం ఉంది.



# అధిక మోతాదులో క్రిమి సంహారక మందుల వినియోగం

తెలంగాణలో రైతులు క్రిమిసంహారకాలను మితిమీరి వినియోగిస్తున్నారని శాస్త్ర నిపుణులు హెచ్చరిస్తున్నారు.. దేశంలోనే అత్యధికంగా పెస్టిసైడ్స్ ను వినియోగిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది అని తాజా నివేదికలో వెల్లడయ్యింది . 2014లో రాష్ట్రంలో సగటున 282 మెట్రిక్ టన్నుల పురుగు మందులను వినియోగిస్తుండగా ఇప్పుడి ఏకంగా 6 వేల మెట్రిక్ టన్నులకు చేరడం వ్యవసాయ, పర్యావరణ శాస్త్రవేత్తలను ఆందోళనకు గురి చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో క్రిమిసంహారకాల వినియోగం కూడా భారీగా పెరుగుతోందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దేశంలో అత్యధికంగా పెస్టిసైడ్స్ వినియోగిస్తున్న రాష్ట్రాల్లో మొదటిస్థానంలో ఉత్తరప్రదేశ్, ఆ తర్వాతి స్తానంలో పంజాబ్ రాష్ట్రాలు ఉన్నాయి.విచ్చలవిడిగా పురుగుల మందుల వాడకంతో నేలసారం దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. చేలకు కొద్దిపాటి చీడ, పీడల లక్షణాలు కనిపించిన వెంటనే పెస్టిసైడ్స్ కంపెనీల వ్యాపార ప్రకటనలు చూసి, ఫర్టిలైజర్ షాపుల యజమానులు అంటగడుతున్న క్రిమిసంహారకాలను రైతులు విచ్చలవిడిగా పంటలపై చల్లుతున్నారు. టి.వి లలో ,సినిమా థియేటర్ లలో వచ్చే ప్రకటనలు కూడా రైతులు నమ్మి అత్యాశ తో సమయం సందర్భం లేకుండా , ఎవరి సలహాలు సూచనలు పాటించక మందులు కొడుతూ వున్నారు. ఫలితంగా రైతుకు అనవసర డబ్బులు ఖర్చు తో పాటు పంటకు కూడా నష్టం కలిగిస్తుంది . ఆర్థికంగా పెట్టుబడి వ్యయం పెరగడంతోపాటు నేలసారం దెబ్బతినడం, పంట ఉత్పత్తుల అవశేషాల్లోనూ హానికారక రసాయనాలు చేరుతున్నాయని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. పంట చేలకు దగ్గరగా వుండే చెరువులు కూడా విషపూరితం అవుతూ వున్నాయి. రసాయన మందుల వాడకం వల్ల దిగుబడులు పెరుగుతాయన్నది అపోహ మాత్రమే . సీజన్‌లోని వాతావరణ అనుకూల పరిస్థితుల వల్ల దిగుబడులు పెరుగాయని, అయితే అది క్రిమిసంహారకాల వాడకం వల్లనే పెరిగిందని రైతులు భావిస్తున్నారని వ్యవసాయశాఖ శాఖ అధికారులు స్పష్టం చేస్తూ వున్నారు.వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకే క్రిమిసంహారకాలను వినియోగించాలని స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి క్రిమిసంహారకాల వినియోగం పెరిగినా కొద్దీ క్రమంగా పంట దిగుబడులు తగ్గడంతోపాటు నేల సారం కూడా దెబ్బతింటుందని హెచ్చరించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఏటేటా సాగులో క్రిమిసంహారకాల వినియోగం పెరుగుతూ వస్తోంది. 201718లో 4866 మెట్రిక్ టన్నుల వినియోగం కాగా--- 201819లో 4894 మెట్రిక్ టన్నులు, 201920లో 4915 మెట్రిక్ టన్నులు, 202021లో 4986 మెట్రిక్ టన్నుల క్రిమిసంహారకాలను రాష్ట్ర రైతులు పంటలపై పిచికారి చేశారనీ వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తూ వున్నారు.సహజసిద్ధమైన సాగు విధానాలను అవలంభిస్తూ నేల భూసారాన్ని పరిక్షిస్తూ, పేడ,పశువుల ఎరువు వేసవిలో కుప్పలుగా పోయాలి. క్రిమిసంహారకాల వినియోగాన్ని 90శాతం తగ్గించి వ్యవసాయం చేయొచ్చని, తద్వారా భూసారాన్ని కాపాడడంతోపాటు రైతులకు పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి.అయితే పురుగుమందుల వాడకాన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు పీఎం ప్రమాణ్ (ప్రధాన మంత్రి ప్రమోషన్ ఆఫ్ అల్టర్నేట్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ) పేరుతో ప్రత్యామ్నాయ పోషకాల వినియోగాన్ని సాగులో ప్రోత్సహించే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసినా ఆ పథకం రైతుల వద్దకు చేరడం లేదు. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల రైతులకు అసలు ఆ పథకం ఒకటుంది అని కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైన వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి.భూ సారం పెంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా,
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.9848445134.



# పర్యాటకంలో.. ఈ ఏడాది టాప్ ఇవే

## కుంభమేళా.. కాశ్మీర్.. గోవా బీచ్ లకు వెల్లువ

పర్యాటకులను ఆకర్షించడంలో భారత్ ఎపుడూ ముందుంటుంది. ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక స్థలాలున్న భారత్ లో ఈ ఏడాది కూడా దేశ, విదేశీ పర్యాటకులు వీటిని సందర్శించారు. ఇందులో పలు చారిత్రక కట్టడాలతో పాటు స్థలాలు, బీచ్ లు, నదీ తీరాలు ఇలా చాలానే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఈసారి పర్యాటకుల సందడి పెరిగింది. ఇందులో ఈ ఏడాది కుంభమేళా జరిగిన ప్రయాగ్ రాజ్ కూడా ఉంది. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటక ఆదాయం కూడా భారీగానే అర్జించాయి. ఈ ఏడాది భారత్ లో అత్యధిక పర్యాటకులు సందర్శించిన కొన్ని టాప్ పర్యాటక ప్రాంతాల్లో మహా కుంభమేళా జరిగిన ప్రయాగ్ రాజ్, కాశ్మీర్, పాండిచ్చేరి, గోవా, లడఖ్, వారణాసి, ఉదయపూర్ ఇలా చాలానే ఉన్నాయి. వీటిలో అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లిన మహా కుంభమేళా టాప్ లో నిలిచింది. ఈ ఏడాది జరిగిన కుంభమేళాకు దాదాపు 100 కోట్లకు పైగా భక్తులు వెళ్లి ఉంటారని ఓ అంచనా. ఈ సందర్భంగా పలుమార్లు తొక్కిసలాటలు కూడా చోటు చేసుకున్నాయి. ప్రయాగ్ రాజ్ తర్వాతి స్థానంలో ఎప్పటిలాగే కాశ్మీర్ కూడా టాప్ పర్యాటక స్థలంగా నిలిచింది. సహజసిద్ధమైన కాశ్మీర్ అందాల్ని చూసేందుకు ఈ ఏడాది కూడా భారీ ఎత్తున పర్యాటకులు వచ్చారు. మధ్యలో ఏప్రిల్ లో పహల్గాం ఉగ్రదాడి జరిగినా కాశ్మీర్ కు వచ్చే పర్యాటకులకు అది ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. దాల్ లేక్ అందాలు, అల్పైన్ గడ్డి మైదానాలు, గుల్మార్గ్ వింటర్ స్పోర్ట్స్ పర్యాటకుల్ని అలరించాయి. అలాగే పాండిచ్చేరిలో ఫ్రెంచ్ భవనాలు, అక్కడి కోస్తా తీరం మౌనం పర్యాటకుల్ని ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత గోవా బీచ్ లు కూడా ఎప్పటిలాగే పర్యాటకులకు ఆతిథ్యం పలికాయి. ఇక్కడి బీచ్ లతో పాటు ఇండోపోర్చుగీస్ సాంస్కృతిక వారసత్వం కూడా పర్యాటకుల్ని అలరించింది. అలాగే కాశ్మీర్ లోని లడఖ్ లో ఎత్తైన ప్రాంతాల్ని పర్యాటకులు ఎక్కువగా సందర్శించారు. దీంతో పాటు వారణాసిలో ఆధ్యాత్మిక ప్రాంతాలకు కూడా పర్యాటకులు పోటెత్తారు. అలాగే రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ సరస్సులకు కూడా పర్యాటకులు బారీగా వెల్లువెత్తారు.

- మహా డెస్క్

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# జర్నలిస్టుకు జర్నలిస్టే శత్రువా?

- వర్కింగ్ జర్నలిస్టుల పై సీనియర్ల కు పక్షపాతం ఎందుకు
- డబల్ బెడ్ రూం ఇళ్ల పంపకాల పై అవే నీలినీడలు
- కొండాను పక్కదారి పట్టిస్తున్న సీనియర్లు ఎవరు?



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపకాల విషయంలో గత ప్రభుత్వ పాలకులు చేసిన తప్పిదమే ఈ ప్రభుత్వంలోని అధికార పార్టీ పాలకులు చేస్తున్నారా అనే సందేహం కలిగిస్తోంది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు బుధవారం వరంగల్ తూర్పు విలేకరులను గురువారం జరిగే సమావేశానికి వారి వారి సంస్థ యొక్క ఐడి కార్డులు ఆధార్ కార్డు, ఐ అండ్ పీఆర్ జారీ చేసిన అక్రిడిటెషన్ కార్డులు తీసుకొని సమావేశానికి రావలసిందిగా కొంతమంది సీనియర్లు జర్నలిస్టులకు తెలిపారు. కాగా ఈ సమావేశానికి విచ్చేసిన జర్నలిస్టుల నుంచి ఎటువంటి పత్రాలు తీసుకోకపోవడం తో జర్నలిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పాలకులు అడగకముందే 20 30 సంవత్సరాల అనుభవం పేరుతో అధికార పార్టీ నేతలను పక్కదోవ పట్టించి తూర్పు జర్నలిస్టుల పై సీనియర్లు వ్యక్తిగతంగా అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 10 సంవత్సరాల క్రైటీరియా పేరుతో కేవలం 80 మందితో ఫైనల్ లిస్ట్ చేస్తామని స్వయాన సీనియర్ జర్నలిస్టులు అనడం, పది యేండ్ల లోపు ఉన్నవారు అర్హులు కాదా..? వర్కింగ్ జర్నలిస్టులు గా కొనసాగుతున్న పలువురు జర్నలిస్టులు ఆందోళనకు గురవుతున్నారు. జర్నలిస్టులకు ఇళ్ల పంపకాల ప్రక్రియలో "అశోక చక్రం" చుట్టూ తిరుగుతున్న విధానం పలు అనుమానాలకు తావిస్తోంది. యూనియన్ సంఘాల నాయకులు స్పష్టమైన సమాధానాలు చెప్పలేక బిక్క మొహం వేసుకుని దిక్కులు చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. గతంలో లబ్ధి పొందిన సీనియర్లకు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పిల్లల పెళ్లిళ్లు చేసే స్థాయిలో ఉన్నవారికే పెద్దపీట వేస్తూ, కూడు-గూడు లేని పేద తూర్పు జర్నలిస్టులను పక్కన పెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ప్రశ్నలకు జవాబులు లేవనే చెప్పాలి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపకాలపై సందిగ్ధత వీడకపోవడంతో ఆమాత్యులు ఎవరికి వరం ఇస్తారో, ఎవరు ఆగమవుతారో అన్న చర్చ జోరుగా సాగుతోంది. పేద జర్నలిస్టుల కడుపులు కొట్టి ఏమి సాధిస్తారో, ఏమి సంపాదిస్తారో వారికే తెలియాలి. మొత్తంగా వరంగల్ తూర్పులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపకాల పేరుతో ఊసరవెల్లి వ్యూహాలు సాగుతున్నాయన్న ఆరోపణలు బలపడుతున్నాయి. న్యాయమైన, పారదర్శకమైన విధానంతో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు బిపిఎల్ కింద ఇళ్లు కేటాయించాలని తూర్పు జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



## సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులు పోరాడాలి

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి**

**రాజేంద్రనగర్, మహా ;** సిపిఐ అగ్ర నాయకుడు అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప విప్లవ నేత ఆయన ఆశయ స్ఫూర్తి కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పోరాడాలి అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ శత వారోత్సవాలను పురస్కరించుకొని సురవరం సుధాకర్ రెడ్డి మెమోరియల్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి విజయ్ ఆనంద్ గార్డెన్ లో ఫైనల్ క్రికెట్ మ్యాచ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా వెంకటరెడ్డి క్రీడాకారులను సిపిఐ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు క్రీడలు మానసిక ఉత్తేజాన్ని దేహదారుఢ్యాని పెంచుతాయని క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని మండల కేంద్రానికి ఒక స్టేడియాన్ని నిర్మించాలి. గ్రామాలలోని యువతి.యువకులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రపంచ దేశాలలో స్టేడియాలను అద్భుతంగా నిర్మాణం చేసి క్రీడాలను ప్రోత్సహిస్తుంటే మన ప్రభుత్వాలు మాత్రం క్రీడాకారులకు మొండి చేయి చూపడం బాధాకరమని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ నెలికంటి సత్యం మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకత్వం క్రికెట్ పోటీలను నిర్వహించి యువతను క్రీడల వైపు వెళ్ళే విధంగా నిర్వహించింది. ఎన్నికైన విన్నర్ టీం మొదటి ట్రోఫీని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, టీ రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు, లింగం, భారతరాజు, నరసింహ, ఆర్ యాదగిరి, ఎం ఏ రియాజ్, కే నరసింహారెడ్డి, సిపిఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, కె చందు యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, క్రికెట్ నిర్వాకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాజేందర్ గౌడ్, ఎండి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు

## సర్పంచులను సన్మానించిన చల్లా ధర్మారెడ్డి..



**పరకాల, మహా:** పరకాల నియోజకవర్గంలోని పరకాల నడికుడ,ఆత్మకూరు,దామెర మండలాల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరచగా గెలుపొందిన నూతన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను హన్మకొండ లోని వారి నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన బరిలో నిలిచి గెలిచి బిఆర్ఎస్ సత్తా చాటిన మీ పోరాటపటిమ అద్భుతమని అభినందించారు. అధికారాన్ని,పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటువేయకుంటే సంక్షేమ పథకాలు ఇవ్వమని ప్రజలను బెదిరింపులకు పాల్పడిన ప్రజలు మాత్రం బిఆర్ఎస్ వైపే ఉన్నారని అన్నారు.వచ్చే ఎంపిటిసి,జెడ్పీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటుతామని తెలిపారు.

చల్లా ధర్మారెడ్డి ని కలిసిన వారిలో.. పరకాల మండలం అలియాబాద్,నడికుడ మండలం. చర్లపల్లి,కౌకొండ, నడికుడ,రామకృష్ణాపూర్, ఆత్మకూరు మండలం పెంచికలపేట,నీరుకుళ్ళ,కామారం,లింగండ గుపల్లి,చౌళ్ళపల్లి, పెద్దాపూర్,ఆత్మకూరు,గూడెప్పాడ్,హౌస్బుజుర్గ్, దామెర మండలం సీతారాంపురం,పులుకుర్తి, దమ్మన్నపేట,తక్కల్లపాడు,దామెర, పసరగొండ, సంగెం మండలం లోహిత,మొండ్రాయి గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకే హెరాల్డ్ కేసు

**జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి**



**రాజేంద్రనగర్, మహా :** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను కక్ష్యపూరితంగా ఇబ్బందులకు గురిచేస్తూన్నా కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహరెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసు లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీని బీజేపీ ప్రభుత్వం కక్ష్యపూరితంగా వేధిస్తోందని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బలహీనపరచాలనే దురుద్దేశంతోనే ఈ కేసును సృష్టించారని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో వ్యక్తులపై దాడి కాదు, ప్రజాస్వామ్యంపై దాడిగా భావించాలన్నారు. హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు న్యాయం జరగాలి నేషనల్ హెరాల్డ్ కేసు ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. బీజేపీ కక్ష్యపూరిత వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని దేశ ప్రజలు తప్పక గద్దె దించుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ కేసును విరమించుకోవాలి. ప్రతిపక్షంపై కక్ష్యపూరిత చర్యలను ఆపాలని డిమాండ్ చేశారుజనన నరేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్ యాదవ్, గడ్డం శేఖర్ యాదవ్, శంషాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ కుటుంబంపై బీజేపీ అక్రమ కేసులు

**డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ కుటుంబం పై అక్రమ కేసులు పెట్టడం పై వరంగల్ ధర్మారం సమీపం లోని బిజెపి కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేషనల్ హెరాల్డ్ కేసులో భారతీయ జనతా పార్టీ ఉద్దేశపూర్వకంగా ఏఐసిసి పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్ల ను చేర్చడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం ముందు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు చేపట్టిన ఆందోళన ఉదృతంగా మారింది. వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం ముందు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు అయూబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉదృతంగా మారింది. కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ఆందోళనతో బిజెపి కార్యాలయానికి వెళ్లే దారి మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోవడంతో అటుగా వచ్చిన బిజెపి నాయకుడు రాణా ప్రతాప్ రెడ్డి వాహనాన్ని అడ్డుకోవడంతో బిజెపి కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు చొరవ తీసుకొని ఇరు వర్గాలను శాంతింప చేసారు. అనంతరం ధర్నా స్థలానికి చేరుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీమంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నిసరన స్థలానికి చేరుకోవడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిజెపి కార్యకర్తలపై జరిగిన ఆందోళనను తెలుసుకున్న బిజెపి నాయకులు ఒక్కొక్కరిగా అక్కడికి చేరుకోవడన్నీ గమనించిన పోలీసులు జిల్లా అధ్యక్షులు అయూబ్, ఎమ్మెల్యేలు నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి తో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ను కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసి గీసుకొండ పోలీస్ స్టేషన్ కు తరలించారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే హెరాల్డ్ కేసులో సుప్రీంకోర్టు తప్పు పట్టిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం అన్యాయమని, స్వాతంత్రం పూర్వం నేషనల్ హెరాల్డ్ అనే పత్రికను స్థాపించి దేశ స్వాతంత్రం కోసం పోరాడిన యోధుల గురించి ఆ పత్రికలో ప్రజలకు తెలియజేయడం జరిగిందని కాగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సోనియా గాంధీ తో పాటు రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు నమోదు చేసి గంటలు తరబడి ఈ డి ఆఫీస్ లో కూర్చోబెట్టి శూనకానందం పొందుతున్నారని అన్నారు. బుధవారం సుప్రీం కోర్టు అక్రమంగా పేరు చేర్చి కొట్టి వేశారని ఈ అక్రమ కేసులను పెట్టిన బిజెపి పార్టీ ని నిలదీయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. బిజెపి ముమ్మందు ఇలాంటి తప్పుడు కేసులు పెట్టుకోవడం మానాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, హెచ్చరించారు. అదేవిధంగా నిరసన శాంతియుత వాతావరణం లో చేపట్టిన నిరసన కార్యక్రమం తెలిపితే కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేల పై కర్రలతో రాళ్లతో దాడికి ఎత్తు నుంచి యత్నించడం కోసం బిజెపి కార్యకర్తలు సిద్ధంగా ఉండడం రౌడీయిజానికి నిదర్శనమని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. ఇది రాజకీయంగా మంచి పరిణామం కాదని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ఈడీల పేరు ఇలా అక్రమ కేసులు పెట్టి ఆనందపడడం మోడీకి తగదని రానున్న రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్ల గొండ రమేష్, కొమరా రెడ్డి, బాబురావు కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శ్రీమాన్, పిసిసి కార్యదర్శి సౌజన్య, మహిళా అధ్యక్షురాలు నాగపురి నారగోని స్వప్న, కరాట ప్రభాకర్, జన్ను రవి, వరంగల్ డివిజన్ అధ్యక్షులు జన్ను వివేక్, కుసుమ సతీష్, సందీప్, కర్ణాకర్, రవీందర్ గోరంట్ల రాజు, మాజీ కార్పొరేటర్ జన్ను రవి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రవీణ్ హుద్దూన్, ఆజం గారు 17వ డివిజన్ అధ్యక్షులు సంఘం. మండలం, గీసుకొండ మండల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమంలో విజయవంతం చేశారు.



## శ్రీ ధన మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న విదేశీయులు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం మెట్ల బావి శ్రీ ధన మైసమ్మ అమ్మవారిని లండన్ నుండి వచ్చిన విదేశీయులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంస్టాగ్రామ్ లో అమ్మవారి ఆలయం గురించి చూసిన వీరు మెట్ల బావి అమ్మవారిని దర్శనం చేసుకున్నామని మాకు ముఖ్యంగా ఆలయ అధ్యక్షులు తోట బాబాన్న వారి సతీమణి తోట సంధ్య వారికి అమ్మవారి చిత్రపటం తో పాటు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించడం జరిగింది

## అన్నదానం - మహాదానం

**రాయికంటి బిక్షపతి**

**ఆమనగల్లు, మహా :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీ నగర్ ఆధ్వర్యంలో కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో జి చెన్నకిషన్ రెడ్డి ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కె గోవర్ధన్ రెడ్డి గారితో కలిసి నూతన సర్పంచ్ బిక్షపతి,జి చెన్నకిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ఆకలితో అలమటిస్తున్న పేద ప్రజలకు ఆకలి తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని ఆయన అన్నారు. నియోజవర్గ స్థాయిలో క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టి సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైన్స్ క్లబ్ సేవలు విస్తృత పరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 350 మందికి అన్నదానం ఏర్పాటు చేశామని లైన్స్ క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాషా తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ ను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డి,కార్యదర్శి లైన్స్ గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి,నూతన సర్పంచ్ బిక్షపతి,జిల్లా చైర్మన్ జూలూరు రమేష్,ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు కర్నాటి కొండాల్ రెడ్డి,జాంగిర్ అలీ, వేణు పంతులు,జలకం రమేష్, కృష్ణ, మహేష్,లాయకఅలి,మల్లేష్ తరుణ్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను గ్రేటర్లు కలపడానికా కాంగ్రెస్ పార్టీలో చేరింది

**బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ ను జోన్ గా ఏర్పాటు చేయాలి. శంషాబాద్ లో జనాభా ప్రతిపాదికనా డివిజన్ల పునర్విభజన జరగాలి. శంషాబాద్ గ్రామాల్లో ప్రజలు వ్యవసాయం చేసుకునే గ్రామాలను తీసుకెళ్లి గ్రేటర్లో కలిపారు. ఇందుకోసం మీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి ఏమాత్రం చెందలేదని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్తిక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉనికి ఉందా? బిఆర్ఎస్ పార్టీకి మనుగడ కొనసాగుతుందా? అనే ప్రశ్నలకు తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో రుజువైందని అయన అన్నారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రకాష్ గౌడ్ తమ ఎమ్మెల్యే అని చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో తిరుగుతూ, కాంగ్రెస్ ఫ్లెక్సీల్లో కనిపిస్తూ, నేను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పుకోవడం ప్రజలను అగౌరవపరచడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి పోతే ధైర్యంగా చెప్పండి కానీ నియోజకవర్గ ప్రజలను పిచ్చోళ్లను చెయ్యొద్దని అన్నారు. రెండు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లోకి పోవడం ఏమాత్రం అభివృద్ధి చెందింది చెప్పాలన్నారు. పార్టీ వీడడంతో శంషాబాద్ నడి బొడ్డున వచ్చే మెట్రో ఎటు పోయింది, శంషాబాద్ మున్సిపాలిటీ చుట్టుపక్క గ్రామాలను గ్రేటర్ లో కలిపి గ్రామాల ప్రజలపై పెను భారం మోపారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కార్తిక్ రెడ్డి సూటి ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీలో చేరిన మీరు మీ ప్రాంత ప్రజలకు మంచి జరగాలే కానీ గ్రామీణ వాతావరణంలో ఉన్న పది గ్రామాలు గ్రేటర్లో విలీనం చేశారు. 10 గ్రామాల్లో ఉంటున్న ప్రజలపై పన్నుల భారం మోపాలని కక్ష కట్టుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ ప్రశ్నించారు. ప్రజలను మీరు ఈరోజు మోసం చేయొచ్చు. భవిష్యత్తులో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్తారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు, దిద్యాల శ్రీనివాస్,బుర్కుంటా సతీష్, కొన్నెమొల్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, హనుమంతు, శేఖర్, చరణ్, గోపాల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ మహా పిరమిడ్ - పత్రీజీ ధ్యాన మహాయాగాలు

- ప్రపంచ వివిధ ప్రాంతాల నుంచి సంబరాలలో పాల్గొనున్న ధ్యానులు
- ప్రతిరోజు లక్ష మందికి ఉచితంగా భోజన వసతి
- ధ్యాన మహా చక్రాల మహాయాగానికి ఏర్పాట్లు పూర్తి
- ధ్యానం చేసేందుకు వీలుగా భారీ ప్రాంగణం
- పిరమిడ్ లోపల ఒకేసారి 5000 మంది ధ్యానం, 30 వెలమందికి బస




**ఆమనగల్లు, మహా:** ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కడ్తాల మం డలం అన్మాస్పల్లి గ్రామ సమీపంలోని కైలాస పురి మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు కొనసాగే పత్రీజీ ధ్యాన మహా యాగం 4 వేడుకలకు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రారంభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయ నున్నారు. భారత ధ్యాన విలువలను ధ్యాన గురువు దివంగత సుభాష్ పత్రీజీ విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతో కృషి చేశారు. ధ్యానం ఐక్య రాజ్య సమితి గుర్తింపు పొందడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఈ వేడుకలకు పెద్ద ఎత్తున సందర్శకులు, ధ్యాన గురువులు వచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తు న్నారు. ఇప్పటికే అక్కడ సందర్శకుల రాకతో సందడి మొదలైంది. .రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం అన్మాస్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న దిపిరమిడ్ కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో ఈనెల 21 నుంచి 31 వరకు 11 రోజులపాటు నిర్వహించే పత్రీజీ ధ్యాన మహాయోగాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహేశ్వర మహా పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీస్ మూమెంట్ ఆల్ ఇండియా ధ్యాన మహా యాగం చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం పిరమిడ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా పత్రీజీ లేని లోటు రాకుండా ధ్యాన మహా త్యాగాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దాదాపుగా ప్రతి రోజు లక్ష మందికి ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కడ్తాల కైలాస పురి మహేశ్వర మహా పిరమిడ్ కు ప్రపంచ పటంలో పిరమిడ్ గా గుర్తింపు లభించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా కుల మత వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా ధ్యాన మహా యాగాలను విజయవంతం చేయాలన్నారు. పత్రీజీ స్థాపించిన మహా పిరమిడ్ కు కడ్తాల ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు లభించిందన్నారు. ఈ పదకొండు రోజులు జరిగే పత్రీజీ మహాయాగాలకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు ఏర్పాటు అయ్యాయని,21 న ఉదయం 10 గంటలకు ధ్యాన గురువు పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీతో కలిసి రాజకీయ ప్రముఖులు ఈ యాగాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పత్రీజీ బతికున్న సమయంలో ఈ మహా పిరమిడ్ కు లక్షలాది మంది ధ్యానులను తయారు చేయడం జరిగిందని వారందరూ దీనిని కాపాడుకుంటారని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ప్రతిరోజు లక్ష మంది ధ్యానులతో నిర్వహించే వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి ధ్యానులు,పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మికవేత్తలు భారీ ఎత్తున రానున్న నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ధ్యానులకు ప్రతిరోజు లక్ష మంది భోజనం చేసేలా ఏర్పాటు కల్పిస్తున్నారు. సరస్వతీ ప్రాంగణంలో ఒకేసారి 30 వేల మంది సామూహిక ధ్యానము చేసుకునేలా వేదికను ఏర్పాటు చేశారు.

**ఎత్తయిన పిరమిడ్ నిర్మాణం**

2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 113.6 మీటర్ల ఎత్తుగా 6 వేలకు పైగా ధ్యానులు ఒకేసారి ధ్యానము చేసేందుకు వీలుగా బండ రాళ్లు, ఇనుముతో నిర్మించారు. పిరమిడ్ నలువైపులా పచ్చని చెట్లతో అందంగా ముస్తాబు చేస్తారు. ఈ నిర్మాణము ఒకఅద్భుతమని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు గతంలోనే గుర్తించి రికార్డు అందజేశారు. పిరమిడ్ మధ్యలో కింగ్ చాంబర్ పాటు క్వీన్ ఛాంబర్ ఉన్నాయి. కింగ్ చాంబర్ పై 500 మంది వరకు, క్విన్ ఛాంబర్ పై 250 మంది వరకు ధ్యానము చేయవచ్చు. పిరమిడ్ ధ్యానము చేస్తే ప్రాణశక్తి మూడు రెట్లు అధికంగా శరీరంలోకి ప్రవేశిస్తుందని ధ్యానుల నమ్మకం. ధ్యానులకు సేవలు అందించేందుకు వాలంటీర్లను, పిరమిడ్ పరిసరాలలో వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరము, ప్రయాణికుల ఏర్పాటు ,విల్లాస్, గార్డెన్, చిన్న పిల్లల కోసం బాల కేంద్రంతోపాటు అఖండ ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**ధ్యాన మహోత్సవాలు**

కడ్తాల మండలం అనుమాస్ పల్లి గ్రామ సమీపంలోనీ మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ నిర్వాహకులు ఏర్పాటు చేశారు .డిసెంబర్ నెలలో జరిగే ధ్యాన మహోత్సవాలకు వివిధ దేశాలు,ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి సంబరాలలో పాల్గొంటారు. ఈ ఏడాది కూడా డిసెంబర్ 31 వరకు 11 రోజుల పాటు మహా పిరమిడ్ లో ధ్యాన ఉత్సవ సంబరాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ధ్యానుల కోసం ఉచితంగా అన్నదాన కేంద్ర,చిన్న పిల్లల కోసం బాల కేంద్రంతో పాటు అఖండ కేంద్రాలను సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానులకు గదుల తో పాటు తాత్కలిక వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు వేలాది మంది ధ్యానం చేసేందుకు వీలుగా భారీ ప్రాంగణం ప్రత్యేకంగా అలంకరించిన పెద్ద వేదికను సిద్ధం చేసినట్లు,సరస్వతి ప్రాంగణంలో ఒకేసారి లక్ష మంది ధ్యానం చేసేలా ఏర్పాట్లు చేశారు. పత్రీజీ శక్తిస్థల్ వద్ద 225 గంటల అఖండ ధ్యానానికి తగిన ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అఖండ సంగీత ధ్యానం, పత్రీజీ వీడియో సందేశం, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యా త్మిక ప్రవచనాలు, భగవద్గీత ప్రవచనాలు, సంపూర్ణ ఆరోగ్య రహ స్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని చైర్మన్ వెల్లడించారు. సరస్వతి ప్రాంగణంలోని పత్రీజీ శక్తి స్థల్లో ధ్యాన వేదిక, ప్రాంగణాన్ని చలికి తట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు ధ్యాన గురువు పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీతో కలిసి పలువురు రాజకీయ ప్రముఖులు ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారని పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కోఆర్డినేటర్ డి మాధవి వెల్లడించారు.

# తూర్పు నియోజకవర్గ అభివృద్దే ప్రధాన లక్ష్యం

**రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ .. రూ.2 కోట్ల 68 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**వరంగల్ మహా ;** వరంగల్ తూర్పు నియోజక వర్గ అభివృద్ధి ప్రధాన లక్ష్యం గా పని చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధి లో గల 38, 39 డివిజన్ లలో రూ.2 కోట్ల 68 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ 38వ డివిజన్ లో సిసి రోడ్లు డ్రైన్లు లకు శంకుస్థాపన తో పాటు కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించుకోవడం నిర్వహించుకోవడం తో పాటు ఖిలా వరంగల్ ఈద్గాకు కోటి రూపాయలు మంజూరు చేసి మరమత్తులు చేపట్టి ఒక ఆకారానికి (రూపానికి) తీసుకురావడానికి తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కోరడం జరిగిందని ఈ ప్రాంతంలో నీరు శాశ్వతంగా నిలిచి ఉండడం వల్ల మొత్తం ఫ్లోరింగ్ చేపట్టి సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు చేపడతామని 37 వ డివిజన్ ఎం ఎం నగర్ లో లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నేపథ్యం లో నిర్మించుకున్న ఇల్లు ప్రారంభోత్సవానికి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఆ ఇంటిని ప్రారంభించడం జరిగిందని, ఇందిరమ్మ ఇల్లు సాధారణ గృహాల మాదిరిగా చాలా చక్కగా నిర్మించారని ఇల్లు కాస్త విశాలం గా ఉండాలని భావించి ఇంటి యజమానులు కొన్ని డబ్బులు వెచ్చించి నిర్మించుకున్నారని ఇళ్లు చక్కగా నిర్మించారని,నిర్మాణం కొనసాగుతున్న ఇళ్లను కూడా సందర్శించడం జరిగిందని ఇళ్లు నిర్మాణం చేసేది ఒక్కసారే నని అట్టి ఇల్లు సౌకర్యవంతం గా ఉండేలా కట్టుకోవడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేస్తామని తెలియజేయడం జరిగిందని అదే క్రమంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇళ్ళ లో అర్హులైన చాలామంది లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని ఇందిరమ్మ ఇళ్ల కోసం చాలా దరఖాస్తులు వస్తున్నాయని ఎల్ 1 లో ఉన్న వారికి మంజూరు ఇస్తామని ఎల్ 2 లో ఉన్నవాళ్ళు స్థలం లేని వాళ్ళు నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పటికే నిర్మించబడి ఉన్నాయని ఇళ్లను కేటాయించిన తర్వాత వాటికి మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని ప్రజలు తమకు అందజేసే ప్రతి ఫిర్యాదును మేయర్ కలెక్టర్ కమిషనర్ లతో మాట్లాడి వారికి కావలసిన అవసరాలు కార్పొరేటర్ లతో చర్చించి వారి అవసరాలను గుర్తించి ప్రస్తుతం కోట్లాది రూపాయల నిధులను వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయడం జరిగిందని ఇంకా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను మంజూరు చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని త్వరలో మరిన్ని శంకుస్థాపనలు చేయడానికి వస్తామని ఈ నేపథ్యంలో కొత్త సమస్యలను కూడా స్థానికులు తమ దృష్టికి తీసుకురావడం జరుగుతుందని ఎయిర్ పోర్టు సమస్య దాదాపు పరిష్కారమైందని జనవరి మొదటి/ రెండో వారంలో ముఖ్యమంత్రి నగరానికి వివిధ ప్రారంభోత్స వాలకు వస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేసి మాట్లాడుతూ వరంగల్ సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మాణం పూర్తయిందని వీటితో పాటు నగరంలో పెండింగ్ లో ఉన్న సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రిని ఆహ్వానించి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వారిచే అట్టి కార్యక్రమాలను ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అంతకు ముందు మధ్య కోట యాదవ వాడ ప్రాంతం లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి నిర్మాణం కొనసాగుతున్న వాసరం హరిత ఆహ్వానం మేరకు ఆ ఇంటిని మంత్రి పరిశీలించి నిర్మాణ తీరును పరిశీలించి లబ్ధిదారు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డి ఆర్ ఓ విజయ లక్ష్మీ, కార్పొరేటర్ లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, బస్వరాజు కుమార స్వామి, కావేటి కవిత, ఎస్ ఈ సత్యనారాయణ, ఏ సి పి శుభమ్ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యను పరిష్కరించిన నూతన సర్పంచ్

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని 7, 8 వార్డులలో త్రాగునీటి సమస్యను నూతన సర్పంచ్ ఎన్నికైన బిక్షపతి గురువారం తీర్చారు. గత కొన్ని రోజులుగా ఆయా వార్డులకు నీరు సరఫరా చేసే బోరు మోటర్ చెడి పోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నూతన సర్పంచ్ వెంటనే మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్దరింప జేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ ఉప సర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి స్థానిక నాయకులు పిప్పళ్ల యాదయ్య, వరికుప్పల సత్యం, కోస్కె యాదయ్య, ఇమ్రాన్ బాబా మరియు కాలనీవాసులు ఉన్నారు

# 82 మందికి షోకాజు నోటీసులు

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆసుపత్రి సిబ్బందికి 82 మందికి షోకాజు నోటీసులు జారీ చేశారు జిల్లా కలెక్టర్ హనుమంత రావు... యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు మూడు గంటల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు విధులకు హాజరు కానీ వారిపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు సమయపాలన పాటించాని 63 మందికి విధులకు గైహాజరు అయినా 19 మందికి షోకాజు నోటీసులు జారీ చేశారు ఆసుపత్రిలో వివిధ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వలన సంబంధిత శానిటేషన్ సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు... ఆస్పత్రిలోని ప్రతి వార్డు కలియతిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డులో ఉన్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ... డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.. ఎస్ ఎన్ సి యు, పీడియాట్రిక్, పోస్ట్ డెలివరీ, డెలివరీ విభాగాల సిబ్బంది పనితీరును పరిశీలించారు. మేల్,ఫిమేల్ ఇన్ పేషెంట్ వార్డు లో రోగులతో మాట్లాడారు.వాళ్ళు ఎందుకు అడ్మిట్ అయ్యారో డాక్టర్ లని అడిగారురోగులను రోజు పెట్టే ఆహారం ఎలా ఉంటుంది దని ఆరా తీశారు ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న నలుగురితో మాట్లాడి వైద్య సమయానికి వస్తున్నార అని అడిగి తెలుసుకున్నారు ఇటీవల డెలివరీ అయిన గర్భిణీలతో మాట్లాడుతూ డాక్టర్లు మంచిగా వైద్యం అందిస్తున్నారా? అన్ని పరీక్షలు చేస్తున్నారా? టీకాలు వేస్తున్నారా అని ఆరా తీశారు ఎమర్జెన్సీ వార్డులో ఎక్కువ ఏ సమస్య మీద ప్రజలు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఓపి సమయంలో ఎంతమంది డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నారు అని ప్రశ్నించారు.

# ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అరెస్టు



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రిన్స్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యేబీర్ల అయిలయ్య తో పాటు జిల్లా స్థాయి నాయకులు ,కార్యకర్తలు,పాల్గొన్నారు.భువనగిరి పట్టణంలో ప్రిన్సికర్నార్ చౌరస్తాలో నిరసన చేసి బీజేపీ కార్యాలయం ముట్టడి కోసం ర్యాలీగా వెళ్తున్న సందర్భంగా పోలీసులు అడ్డుకొని బీర్ల అయిలయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకొని భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తూ, పార్లమెంట్ సాక్షిగా ప్రజలకు తెలియజేస్తున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీపై తప్పుడు కేసులు పెడుతూ వారిని ఇబ్బంది పెట్టాలని కుట్రలు చేస్తున్నారని చెప్పారు ఇలా ప్రశ్నించే వారిని భయపెట్టాలని కుట్రలు చేస్తున్న బీజేపీ పార్టీని హెచ్చరిస్తున్నట్లు చెప్పారు.కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో చేస్తున్న అరాచకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. సాక్షాత్తు నేషనల్ హెరాల్డ్ కేసులో రాజ్యాంగబద్ధంగా, సాక్ష్యాలను నిరూపిస్తూ కేసును నమోదు చేయలేదని, కోర్టుకు ఈడీకి మొట్టికాయలు వేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీ, సోనియా గాంధీకి అండగా ఉన్న దేశ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం బీర్ల అయిలయ్యను, కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అరెస్ట్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా నాయకులు తంగల్లపల్లి రవి కుమార్,పోత్నక్ ప్రమోద్ కుమార్,బర్రె జహంగీర్, కుక్క దువ్వ సోమయ్య,కూర వెంకటేష్, వెంకటేశ్వర రాజు తదితరులు ఉన్నారు.



## ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి:ఎమ్మెల్యే

**అమనగల్లు, మహా:** గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే నివాసంలో అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్ గా ఎన్నికైన రాజేశ్వరి మల్లేష్,ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, 10 వార్డు సభ్యులును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామన్నారు. గ్రామాల అభివృద్ధికి సైతం అందరూ కలిసి కృషి చేయాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో నూతన వార్డు సభ్యులు మల్లేష్,ప్రేమి హన్మ,జయందర్,సితి భాస్కర్,సీతారాం,కవిత, మణిపాల్,దేవేందర్,తావుర్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్,తాండ సీనియర్ నాయకులు తావుర్య, శంకర్,గెమ్య, రాంజ్య, రాములు,పురుషోత్తం,హరిలాల్,తతులచ్య,పాండు, కృష్ణ,లక్ష్మణ్,కుమార్,వశాంత్,పాండు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ సూత్రాలు అనుసరిస్తూ ఉద్యోగం నిర్వహించాలి

**నూతన ఉద్యోగులు సీనియర్ల వద్ద సలహాలు తీసుకోవాలి**



**మందమర్రి, మహా :** రక్షణ సూత్రాలు అనుసరిస్తూ ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ, జిఎం (ఈ అండ్ ఎం)సిడబ్ల్యూఎస్(కార్పొరేట్)ఎందామోదర్‌రావులు అన్నారు. శుక్రవారం స్థానిక వర్క్ షాప్ లో 56వ రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణతో ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని అన్నారు. ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వాటిని పాటించడం వల్ల ప్రమాదాల శాతం తగ్గుతుందని వెల్లడించారు. తద్వారా సింగరేణి సంస్థకు దేశ భవిష్యత్తుకు మంచి ప్రఖ్యాతలు వస్తాయని పేర్కొన్నారు. సంస్థ మనుగడ కొనసాగాలంటే ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం సాధించాలని వివరించారు. రక్షణ కొరకు ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన రక్షణ పరికరాలను, పనిముట్లను వాడాలని వారు ఆదేశించారు. సింగరేణి ఉద్యోగులు నిత్యం పోషక విలువలతో కూడిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని వెల్లడించారు. ఏరియాలో కార్మికులు గైర్హాజరు శాతాన్ని తగ్గించి సంస్థ భవిష్యత్తుకు పాటుపడాలని చెప్పారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి ఉద్యోగులు సీనియర్ కార్మికుల ను సలహాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. పని స్థలాలలో జరిగే అంకులు ప్రమాదాలకు గురైతే ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) గురించి అర్థమయ్యే రీతిలో ఫస్ట్ ఎయిడ్ సభ్యులు ఉద్యోగులకు వివరించారు. అనంతరం సింగరేణి కమ్యూనికేషన్స్ సెల్ సభ్యులచే రక్షణ జాగ్రత్తల గురించి లఘు నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జి ఎల్ ప్రసాద్, బెల్లంపల్లి రీజనల్ రక్షణ జిఎం రఘు కుమార్, ఏరియా రక్షణ అధికారి భూ శంకరయ్య, మందమర్రి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తో పాటు రక్షణ కమిటీ సభ్యులు కే వెల్దారి, జి దామోదర్, కే నాగేశ్వరరావు, కే సుధాకర్, జి నాగసాయి సందీప్, ఎం బాలాజీ భగవతి జా, దూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## రాబోయే ఎన్నికల్లో భువనగిరి గుట్టపై గులాబీ జెండ ఎగురావేయాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**భువనగిరి, మహా:** రాబోయే జెడ్పీటీసీ ఎంపిటీసి ఎన్నికల్లో భువనగిరి గుట్టపై గులాబీ జెండా ఎగురవేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామరావు పిలుపునిచ్చారు... గురువారం నాడు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లాలోని 17 మండలాల లో గెలిచిన సర్పంచ్ లను కేటిఆర్ అభినందిచి శాలువా మెమొటోలతో సత్కరించారు.. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, భువనగిరి ,ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు ఫైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునితా మహేందర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్, మాజీ mlc కర్రె ప్రభాకర్,మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ ,కుసుకుంట్ల ప్రభసకర్ రెడ్డి, లింగం యాదవ్ ,లింగయ్య, తదితరులు ఉన్నారు.

# గ్రామ ప్రజల ఋణం తీర్చుకుంటా...

**సర్పంచ్, ఆవుల నరసింహ**



**వలిగొండ, మహా:** వలిగొండ మండలం గురునాథ్ పల్లి గ్రామ సర్పంచ్ ఆవుల నరసింహ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో ఆదరించి గెలిపించినందుకు గ్రామ ప్రజల ఋణం తీర్చుకుంటానని అన్నారు.ఎన్నికల సమయంలో గ్రామానికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని తెలిపారు. అదేవిధంగా నా గెలుపు బాధ్యతలను పూర్తిగా పార్టీ కార్యకర్తలు తమ భుజాలపై వేసుకొని విజయం సాధించే వరకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకముగా కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాల పని వేళల్లో మార్పు

**కలెక్టర్ ఆదేశాలు**

**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో తీవ్ర చలి వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాల సమయాల్లో మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాల సమయాలను సవరించి, ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగేలా నిర్ణయించారు. ఈ మార్పులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లకు వర్తిస్తాయని పేర్కొన్నారు. అన్ని మండల విద్యా అధికారులకు, ప్రభుత్వ, ఎల్బీ, కేజీబీవీ, మోడల్ హై స్కూళ్లు, అలాగే ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ లో చేరిన ఉప సర్పంచ్



**ఆదిలాబాద్, మహా :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల లో గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.గురువారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో సాత్నాల మండలంలోని న్యూ రాంపూర్ నుండి ఎన్నికైన ఉప సర్పంచ్ కోట్నాక లాల్ షావు ఆ గ్రామ సర్పంచ్ వేణుగోపాల రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో కి చేరికలు జరుగుతున్నాయన్నారు. న్యూరాంపూర్ గ్రామభివృద్ధికి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధికి పాటు పడుతామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కొండూరి రవి, నిఖిలేష్, రాజీవ్, రవి సాత్నాల మండల నాయకులు కుంట భూమారెడ్డి , కొట్నాక్ రాము, దొర్చేట్టి లింగన్న, ఆశన్న, కుమార్ రెడ్డి, శుభాష్, వామన్ రెడ్డి, రాకేష్ రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలనువిరమించుకోవాలి

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి**

**హుజూర్ నగర్ మహా** గాంధీజీపై వ్యతిరేకతను చూపేందుకు నిరుపేద ప్రజలపై కక్ష సాధించడం తగదని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్) పేరును మార్చి నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణం లో ఉపాధి కూలీలు, కార్మికులతో కలిసి రోషపతి మాట్లాడుతూ సంపద సృష్టికర్తలైన కార్మికుల హక్కులను లేబర్ కోడ్‌ల ద్వారా నిర్వీర్యం చేసి, పెట్టుబడిదారుల కు అనుకూలంగా చట్టాలు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు.ఈ చట్టం పేరును మార్చడం ద్వారా పేదల ఉపాధిని హరించే ప్రయత్నం జరుగుతోందని ఆయన తెలిపారు. పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనల మధ్య కేంద్ర మంత్రి సురాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం ఈ అంశాన్ని ప్రవేశపెట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, వామపక్ష ఎంపీలు సభలో నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. దేశంలోని పేద ప్రజలకు జీవనాధారం అయిన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం పేదల పొట్ట కొట్టడమేనని రోషపతి అన్నారు.



## వ్యక్తి అదృశ్యం

**మొయినాబాద్ మహా:** ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల శ్రీకాంత్ వయస్సు (35) బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుండి బయటికి వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి ఇంటికి రాలేదని అతని భార్య పెండ్యాల నీతూ తన భర్తకి ఫోన్ చేయగా ఫోన్ కలవకపోవడంతో తన భర్త కోసం చుట్టుపక్కల బంధుమిత్రుల దగ్గర ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదురాలు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# న్యూయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి

- **రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్**
- **వేడుకల నిర్వహణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి**
- **అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు**



**మొయినాబాద్ మహా:** నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనీ దేవి గార్డెన్ లో మొయినాబాద్ మున్సిపల్, మండల పరిధిలోని ఆయా గ్రామాల ఫామ్హౌస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలు బాధ్యతాయుతంగా చట్టబద్ధంగా మరియు సురక్షితంగా నిర్వహించాలని పేర్కొన్నారు. వేడుకల్లో పరిసర ప్రాంతాల్లో ఎలాంటి మత్తుపదార్థాలు వినియోగం నిల్వ లేదా విక్రయం జరగకూడదని, నిర్వాహకులకు డీసీపీ యోగేష్ గౌతమ్ సూచించారు. డ్రగ్స్ కు సంబంధించిన ఏ విధమైన అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలు చట్ట ప్రకారం ప్రజా భద్రత, శాంతిభద్రతలు, సామాజిక బాధ్యతను దృష్టిలో పెట్టుకొని వేడుకలు నిర్వహించాలని, నిర్వాహకులకు సూచించారు. అనుమతించిన సమయంలోపే వేడుకలను ముగించాలని స్పష్టం చేస్తూ.. సంగీత కార్యక్రమాల శబ్దం నిర్దేశిత పరిమితిలోనే ఉండాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ వేడుకల్లో డ్రగ్స్ అరికట్టే పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని, నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేయరాదని, 21 ఏళ్లలోపు ఉన్న మైనర్లకు మద్యం అందించడం ఆశ్లీల నృత్యాలు బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదని, వేడుకల్లో పటాకులు ఆయుధాలు ప్రమాదకర ప్రదర్శనలు పూర్తిగా నిషేధమని తెలిపారు. వేడుకల ప్రాంగణంలో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రవేశ ద్వారాలు నిష్క్రమణ ద్వారాలు పార్కింగ్ ప్రాంతాలు డాన్స్ ఫ్లోర్, ఫుడ్ కోర్టులు మరియు బార్ కౌంటర్ లను సీసీ కెమెరాలతో నిగా పెట్టాలని సూచించారు. తగినంత ప్రవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. ఈ వేడుకల్లో ఏ విధమైన నష్టం అపఘుతం లేదా అసౌకర్యానికి నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. పోలీస్ అధికారులు జారీ చేసే ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసిపి కిషన్, మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఫామ్హౌస్ యజమానులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఉమా యాదయ్యను అభినందించిన అందెల శ్రీరాములు

- **మహేశ్వరం బిజెపి కార్యాలయంలో ఆగపల్లి బిజెపి నాయకులు**
- **వచ్చే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో సత్తా చాటాలనా అందెల**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నూతనంగా ఎన్నికైన ఆగపల్లి గ్రామ సర్పంచ్ లకుమల్ల ఉమా యాదయ్యని, బిజెపి నాయకులు అందెల శ్రీరాములు అభినందించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం ఆగపల్లి గ్రామంలో బుధవారం జరిగినటువంటి సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించినటువంటి భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి లకుమల్ల ఉమా యాదయ్య, ఉప సర్పంచ్ యాట రమేష్, ఆరు వార్డులలో గెలుపొందిన మెంబర్లతో కలిసి, గురువారం రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములుని, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి సర్పంచ్ మరియు పాలకవర్గాన్ని శ్రీరాములు ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరేల కృషి చేయాలని సూచించారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లోను ఇదే సత్తాను కొనసాగించి భారతీయ జనతా పార్టీకి అఖండ మెజారిటీతో గెలిపించాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు చిట్టిబాబు, బద్దుల మహేందర్, అందెల ఐలయ్య యాదవ్, గంధంగూడెం వెంకటేష్, అశ్వాల జంగయ్య, బిజెపి, బీజేవైఎం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 11% నుండి 24%కి హెచ్ఆర్ఏ పంపు

**హర్షం వ్యక్తం చేసిన రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** హెచ్ఆర్ఏ 11% నుండి 24%కు పెరిగినందుకు జిల్లా కలెక్టర్ ను కలిసి హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపిన రంగారెడ్డి జిల్లా టీజీఓ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి. గురువారం జరిగిన రంగారెడ్డి జిల్లా టీజీవో కార్యవర్గ సమావేశంలో 24% హెచ్ఆర్ఏ పెరిగినందుకు జిల్లా కలెక్టర్ కు ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు చెప్పాలని, ఈ విషయంలో సహకరించిన టీజీవో సెంట్రల్ అసోసియేషన్ కు కూడా ధన్యవాదాలు తెలపాలని ఏకగ్రీవంగా తీర్మానించనైనది. రిటైర్మెంట్ తర్వాత ఖాళీ అయిన అసోసియేట్ అధ్యక్ష పదవికి నూతనకంటి వెంకట్ ను అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించుటకు ఏకగ్రీవంగా తీర్మానించనైనది...

**11% నుండి 24%కి హెచ్ఆర్ఏ పంపు.....**

తదుపరి జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఐడిఓసి, కొంగరకలాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు హెచ్ఆర్ఏను 11% నుండి 24% కి పెంచినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినారు. ఇది తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం చొరవతో మాత్రమే జరిగింది. దీనికి తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నాము. మరియు దీనిపై తక్షణమే చర్యలు తీసుకున్నందుకు మరియు గత 3 సంవత్సరాలుగా (ఆర్థికంగా నష్టపోయిన) బాధపడుతున్న మా ఐడిఓసి కొంగరకళాన్ ఉద్యోగులకు పెద్ద ఉపశమనం ఇచ్చినందుకు మా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి మేము హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కంటి వెంకట్, శాంతి శ్రీ, అనిత, రాకేష్, సైదమ్మ, పద్మావతి, బాలరాజ్ గౌడ్, బాలేశ్వరి, మసూద్ అలీ, పావని మరియు ఐడిఓసి ఉద్యోగులు పాల్గొన్నారు.

## అశాంతిని నెలకొల్పడానికి గ్రామాలను గ్రేటర్‌లో విలీనం..

**ఎంఐఎం పార్టీకి ప్రయోజనం కలిగే విధంగా డివిజన్‌లో పునర్విభజన జరుగుతుంది**

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నందకిషోర్ గుప్తా**



**రాజేంద్రనగర్, మహా ;** పచ్చని పల్లెటూర్లైన శంషాబాద్ గ్రామాలను గ్రేటర్ లో కలిపి ఓల్డ్ సిటీ లాగా శంషాబాద్ గ్రామాలను తయారు చేయాలన కుట్రలో భాగంగానే శంషాబాద్ పరిధిలోని గ్రామాలను గ్రేటర్లో కలిపారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నందకిషోర్ గుప్తా, బీజేవైఎం మాజీ ఉపాధ్యక్షులు శ్రీధర్, బిజెపి నాయకులతో కలిసిశంషాబాద్ మున్సిపాలిటీపరిధిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ ఎంఐఎం పార్టీకి హైదరాబాద్ మహానగరాన్ని తాకట్టుపెత్తే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఓల్డ్ సిటీ నగరంలా శంషాబాద్ మల్చే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. శంషాబాద్ గ్రామీణ ప్రాంతం వ్యవసాయంపై ఆధారపడి ఇక్కడి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారు. హఠాత్తుగా గ్రామాలను గ్రేటర్ లో కలపడం అంటే వ్యవసాయ పొలాలను లాక్కునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుమానం కలగక మానదు. ఎంఐఎం స్థానాల్లో ఎలాంటి మార్పులు లేవు, బిజెపి స్థానాల్లోని పునర్విభజన పేరుతో మైనార్టీ ఓట్లను కలుపుతున్నారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్ పార్టీతో డివిజన్లో పునర్విభజన పేరుతో హిందూ సమాజంపై కుట్ర జరుగుతుందన్నారు. శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలి. జనాభా ప్రతిపాదికన డివిజన్లో పునర్విభజన జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాస్,శ్రీకాంత్, రమేష్, సుఖేందర్, అనిల్, నరేష్, కుమార్, మహేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

# శంషాబాద్ ను ప్రత్యేక జోన్ చేయాలి

**శంషాబాద్ లో 4 డివిజన్ లుగా విభజించాలి**

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ కు వినతి పత్రాలు**



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ వి కర్ణన్ కు వినతి పత్రాలు గురువారం అందజేశారు నాయకులు దేవరంపల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ జిహెచ్ఎంసిని చార్మినార్ జోన్లో కలప వద్దన్నారు. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ నేషనల్ హైవే బస్ స్టాప్ అన్ని సౌకర్యాలు కలిగిన శంషాబాద్ పాతబస్తీలో విలీనని వ్యతిరేకిస్తామన్నారు. శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ వార్డు విభజన అస్తవ్యస్తంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో 50వేల తక్కువ ఓట్లు ఉంటే అక్కడ మూడు కార్పొరేట్లు చేశారు, 60 వేల ఓట్లు కలిగిన శంషాబాద్ మున్సిపాలిటీని జిహెచ్ఎంసిలో విలీనం చేసి కేవలం రెండు కార్పొరేట్లుగా చేయడం ఏంటి అని ప్రశ్నించారు. శంషాబాద్ ను నాలుగు కార్పొరేట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొన్నెమొల్ల శ్రీనివాస్, బండి గోపాల్, కేవై ప్రణయ్, జిల్లా ఆనంద్, పరమేశ్వరి నరేందర్, రాజేందర్, ఎన్ మల్లేష్, జై సింహా, వెంకట్ రెడ్డి,గుంటి చరణ్, భాస్కర్, పవిత్ర సాగర్, చిలుక మరి పరంధాములు, రాచమల్ల వరదన్ తదితరులు పాల్గొన్నారు.




# పీఎఫ్ కొత్త రూల్.. ఎన్‌పీఎస్ నుంచి ఇక 80 శాతం విత్‌డ్రా

జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్) సభ్యులకు హర్షా నిచ్చే మార్పులకు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్ఆర్‌డీఏ) శ్రీకారం చుట్టింది. పదవీ విరమణ నాటికి సమకూరిన మొత్తం నిధిలో 60 శాతం ఉపసంహరణకు ప్రస్తుతం అనుమతి ఉండగా, ఇకపై 80 శాతం వెనక్కి తీసుకోవచ్చు. మిగిలిన 20 శాతంతో యాన్యూటీ ప్లాన్ (క్రమానుగతంగా పింఛను చెల్లించే) కొనుగోలు చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం గరిష్ఠంగా 70 ఏళ్ల వయసు వరకే ఎన్‌పీఎస్‌లో కొనసాగేందుకు అనుమతి ఉంది. దీన్ని ఇప్పుడు 85 ఏళ్లకు పెంచారు. ఇందుకు సంబంధించి కొత్త నిబంధనలను పీఎఫ్ఆర్‌డీఏ ప్రకటించింది. గెజిట్ ప్రకటించిన తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తాయని తెలిపింది.

- పథకం నుంచి వైదొలిగే నాటికి పింఛను నిధి రూ.8లక్షల్లోపు ఉంటే ఆ మొత్తాన్ని సభ్యులు ఒకే విడత, లేక సిస్టమ్యాటిక్ యూనిట్ రిడెంప్షన్ రూపంలో (క్రమానుగతంగా/ఫండ్స్‌లో ఎస్‌డబ్ల్యూపీ మాదిరి) వెనక్కి తీసుకోవచ్చు.
- నాలుగేళ్ల విరామంతో సభ్యులు ఇకపై నాలుగు పర్యాయాలు పాక్షిక ఉపసంహరణ చేసు కోవచ్చు. ప్రస్తుతం 3 సార్లకు అనుమతి ఉంది.
- 60 ఏళ్ల రిటైర్మెంట్ వయసు తర్వాత కొనసాగే వారు మూడేళ్ల విరామంతో మూడు పాక్షిక ఉపసంహరణలే చేసుకోగలరు.
- ఎన్‌పీఎస్‌లో ప్రభుత్వ చందాదారులు సైతం 85 ఏళ్ల వరకు కొనసాగొచ్చు. అంటే 85 ఏళ్లు వచ్చే వరకు పెట్టుబడులను సైతం కొనసాగించుకోవచ్చు. వీరు పథకం నుంచి వైదొలిగే సమయంలో కనీసం 40 శాతంతో యాన్యూటీ ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. మిగిలిన 60 శాతాన్ని ఒకే విడత లేదా క్రమానుగతంగా వెనక్కి తీసుకోవచ్చు.
- రాజీనామా లేక తొలగింపు కారణంగా పథకం నుంచి ముందుగా వైదొలిగే ప్రభుత్వ చందాదారులు.. పింఛను నిధి నుంచి 20 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. మిగిలిన 80 శాతంతో యాన్యూటీ ప్లాన్ తీసుకోవడం తప్పనిసరి.
- పింఛను నిధి రూ.5 లక్షల్లోపే ఉంటే.. సాధారణ వైదొలగడం, ముందస్తుగా వైదొలగడం లేదా సభ్యుడు మరణించిన సందర్భాల్లో పూర్తి మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు.



# మారుతీ వ్యాగన్‌ఆర్‌లో తిరిగే సీటు!

సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు వాహనంలోకి సులువుగా ఎక్కడానికి, దిగడానికి వీలుగా తమ వ్యాగన్‌ఆర్ కారులో స్వివల్ సీట్ ఆప్షన్‌ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వెల్లడించింది. రోజువారీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుందన కంపెనీ ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. వ్యాగన్‌ఆర్ స్వివల్ సీటు .. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ (ఏఆర్ఏఐ) భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని వివరించారు. అసమానతలను తొలగించే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన పర్యావరణహిత అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ఇది ముందడుగని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 11 నగరాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద 200కు పైగా మారుతీ సుజుకి అరేనా డీలర్‌షిప్‌లలో ఈ స్వివల్ సీటు ఏర్పాటు సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. కొత్త వ్యాగన్‌ఆర్ కార్లకు అలాగే ఇప్పటికే ఉన్న కార్లకు కూడా దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి ఏఆర్ఏఐ సర్టిఫికేషన్, 3 సంవత్సరాల వారంటీ లభిస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం మారుతీ సుజుకి, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ ఐఐఎం బెంగళూరు స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ కింద బెంగళూరుకు చెందిన ట్రూఅసిస్ట్ టెక్నాలజీ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వినియోగదారులు వ్యాగన్‌ఆర్ స్వివెల్ సీట్‌ను రెట్రోఫిట్ కిట్‌గా అరేనా డీలర్‌షిప్‌లలో ఆర్డర్ చేయవచ్చు. వాహనం నిర్మాణం లేదా ప్రాథమిక పనితీరులో ఎటువంటి మార్పులు చేయకుండా ఈ సీటును అమర్చుతారు. టాల్ బాయ్ డిజైన్ కలిగిన వ్యాగన్‌ఆర్.. విశాలమైన హెడ్‌రూమ్, లెగ్‌రూమ్‌తో ఈ ఇన్నోవేటివ్ మొబిలిటీ సొల్యూషన్‌కు అత్యంత అనుకూలంగా నిలుస్తుంది. భారత్‌లో అత్యధికంగా అమ్ముడయ్యే మారుతి సుజుకీ మోడళ్లలో వ్యాగన్‌ఆర్ ఒకటి.

# 2025లో బెస్ట్ బడ్జెట్ ఫోన్లు ఇవే..



2025 ఏడాది ముగింపునకు వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో కొత్త సంవత్సరం 2026 ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలో వినియోగదారులు ఎప్పటికప్పుడు మార్చే డివైజ్ ఏదైనా ఉందంటే అది స్మార్ట్ ఫోన్. శాంసంగ్ నుంచి మొదలు పెడితే పోకో వరకూ ఇలా అనేక మొబైల్ బ్రాండ్‌లు ప్రతినెలా కొత్త మోడల్ స్మార్ట్ ఫోన్‌లను మార్కెట్‌లో విడుదల చేస్తూనే ఉంటాయి. అయితే ఎక్కువ మందికి కావాల్సినవి.. కొనేవి బడ్జెట్ ఫోన్‌లే కాబట్టి.. రూ.20 వేల ధరలోపు 2025లో వచ్చిన బెస్ట్ స్మార్ట్‌ఫోన్‌లేవో ఈ కథనంలో చూద్దాం.. వీటిని చాలా మంది ఇప్పటికే కొని వినియోగిస్తుండవచ్చు. లేదా ఇప్పుడు కొనుక్కోవచ్చు.. షియోమీ రెడ్‌మీ నోట్ 14 5జీ: పనితీరు, కెమెరా, బ్యాటరీ సమతుల్య మిశ్రమంతో అద్భుతమైన ఆల్ రౌండర్. రోజువారీ ఉపయోగం, స్ట్రీమింగ్, క్యాజువల్ గేమింగ్ కోసం రూ.17,000 లోపు మంచి ఆప్షన్. రియల్‌మీ 14ఎక్స్ 5జీ: మంచి డిస్‌ప్లే, బ్యాటరీ లైఫ్‌తో బడ్జెట్ ఎంపిక. ధర రూ.15,000 కంటే తక్కువ. దృఢమైన రోజువారీ పనితీరు, 5జీ సపోర్ట్ కోరుకునేవారికి సరిగ్గా సరిపోతుంది. మోటరోలా మోటో జీ86 పవర్ 5జీ: మంచి పనితీరు, బ్యాటరీ లైఫ్, క్లీన్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పీరియన్స్‌తో బ్రాండ్ సపోర్ట్‌తో రూ.18,000 కంటే తక్కువ ధరలో అద్భుతమైన మిడ్‌రేంజ్ ఫోన్ ఒప్పో కే13 5జీ స్టైలిష్: డిజైన్, సులభమైన పనితీరు దీన్ని రూ.20,000 లోపు ఫోన్‌లలో పోటీ ఎంపికగా చేస్తుంది. డిస్ ప్లే క్వాలిటీ విషయంలో మంచి రేటింగ్స్ పొందింది. వన్‌ప్లస్ నార్డ్ సీఈ 2 లైట్ 5జీ: తక్కువ ధర పాయింట్ (రూ.12 వేలు నుంచి రూ.15 వేలు) వద్ద క్లీన్ యూజర్ ఎక్స్‌పీరియన్స్, మంచి పనితీరును కోరుకుంటే ఇది మంచి ఆప్షన్.

### ఆయుధాలుగా మారుతున్న

# వాణిజ్య సుంకాలు

**అంతర్జాతీయ వర్తకంపై ఆర్థిక మంత్రి సీతారామన్**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వాణిజ్యం టారిఫ్‌లు, ఇతర రూపాల్లో ఆయుధాలు గా మారుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భారత్ కేవలం టారిఫ్‌లను ఎలా ఎదుర్కోవాలన్న దానికే పరిమితం కాకుండా, ఈ విషయమై జాగ్రత్తగా సంప్రదింపులు కొనసాగించాల్సి ఉంటుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడం మనకు అనుకూలమని ఒక జాతీయ దినపత్రిక నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పేర్కొన్నారు. ''స్వీయ ప్రయోజనాల ధోరణితో ఉందంటూ భారత్‌కు పాఠాలు బోధించొచ్చు. సుంకాల రాజుగా అభివర్ణించొచ్చు. కానీ, టారిఫ్ ఆయుధంగా మారిపోయింది. వీటిని ఆయుధాలుగా మార్చు కోకూడదన్నది భారత్ ఉద్దేశం. పోటీ దేశాల నుంచి పెద్ద ఎత్తున ఉత్పత్తులు వరుస కట్టినప్పుడే దేశీ పరిశ్రమను కాపాడుకునేందుకు భారత్ రక్షణాత్మక చర్యలను అనుసరిస్తుంది'' అని మంత్రి స్పష్టం చేశారు.



## దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL



# స్టీల్‌కు పెరగనున్న డిమాండ్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో స్టీల్‌కు డిమాండ్ 8 శాతం పుంజుకోనున్నట్లు రేటింగ్ దిగ్గజం ఇక్రా అంచనా వేసింది. అయితే పోటీధరల కారణంగా స్టీల్ తయారీ కంపెనీల మార్జిన్లపై ఒత్తిళ్లకు అవకాశమున్నట్లు ఒక నివేదికలో పేర్కొంది. స్టీల్ పరిశ్రమ నిర్వహణలాభ మార్జిన్ నిలకడగా 12.5 శాతం స్థాయిలో నమోదుకావచ్చని అభిప్రాయపడింది. వెరసి మార్జిన్లు మెరుగుపడనున్నట్లు గతంలో వేసిన అంచనాలను సవరించింది. కాగా.. ఈ ఏడాది స్టీల్ డిమాండ్ 8 శాతం స్థాయిలో పటిష్టంగా నమోదుకావచ్చని అంచనా వేస్తున్నట్లు ఇక్రా కార్పొరేట్ రంగ రేటింగ్స్ గ్రూప్ హెడ్ గిరీష్‌కుమార్ కదమ్ తెలియజేశారు. అయితే సరఫరాలు పెరగనుండటంతో తాత్కాలికంగా డిమాండును మించి సరఫరాకు వీలున్నట్లు పేర్కొన్నారు. ఫలితంగా స్టీల్ ధరలపై ఒత్తిళ్లు కొనసాగవచ్చని తెలియజేశారు.

**సేఫ్‌గార్డ్ డ్యూటీ రక్షణ**

ఇక్రా నివేదిక ప్రకారం దేశీయంగా హాట్‌రోల్డ్ కాయిల్ (హెచ్‌ఆర్‌సీ) ధరలు 2025 ఏప్రిల్‌లో టన్నుకి రూ. 52,850కు ఎగశాయి. సేఫ్‌గార్డ్ డ్యూటీ విధింపు ఇందుకు సహకరించింది. ఆపై నవంబర్‌కల్లా టన్ను ధర తిరిగి రూ. 46,000కు దిగివచ్చింది. దిగుమతి ధరలకంటే దిగువకు చేరింది. వ్యవస్థాగత అంశాల కారణంగా ప్రస్తుత కేలండర్ ఏడాది(2025) తొలి 9 నెలల్లో చైనా స్టీల్ ఎగుమతులు 8.8 కోట్ల టన్నులను తాకాయి. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. దీంతో ప్రపంచ స్టీల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో చైనా హెచ్‌ఆర్‌సీ ఎగుమతి ధరలు సగటున టన్నుకి 465 యూఎస్ డాలర్లుగా నమోదయ్యాయి. ఏడాదిక్రితం నమోదైన 496 డాలర్లతో పోలిస్తే 6 శాతం తగ్గాయి. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ఫినిష్డ్(తుది ఉత్పత్తి) స్టీల్ దిగుమతులు వార్షికంగా 33 శాతం క్షీణించాయి. దీంతో చౌక దిగుమతులను అడ్డుకునేందుకు సేఫ్‌గార్డ్ డ్యూటీ కొనసాగింపు కీలకమని ఇక్రా పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం దేశీ హెచ్‌ఆర్‌సీ ధరలు 2026 మార్చివరకూ సగటున టన్నుకి రూ. 50,500గా కొనసాగే వీలున్నట్లు అంచనా వేసింది. ఫలితంగా టన్ను స్టీల్ ఉత్పత్తిపై నిర్వహణ లాభం గతేడాది(2024-25)లో నమోదైన 110 డాలర్ల నుంచి 108 డాలర్లకు నీరసించవచ్చని తెలియజేసింది. వెరసి స్టీల్ రంగానికి నిలకడతోకూడిన ఔట్‌లుక్ ప్రకటించింది.

**సామర్థ్య విస్తరణ ఎఫెక్ట్**

దేశీయంగా స్టీల్ పరిశ్రమలో భారీ సామర్థ్య విస్తరణ ప్రణాళికలు అమలవుతున్న కారణంగా రిస్క్‌లు పెరగవచ్చని ఇక్రా తాజా నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం 2026-31 మధ్య కాలంలో దేశీ స్టీల్ పరిశ్రమలు 8-8.5 కోట్ల టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యాన్ని అదనంగా జత కలుపుకునే ప్రణాళికలు అమలు చేయనున్నాయి. ఇందుకు 4.5-5 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 45,000 కోట్లు) పెట్టుబడులు వెచ్చించనున్నాయి. అయితే తగినస్థాయిలో విక్రయాలు, ఆర్జన మెరుగుపడకపోతే భారీ పెట్టుబడుల కారణంగా మధ్యకాలానికి స్టీల్ పరిశ్రమ రుణభారం పెరిగిపోయే అవకాశముంది. ఇక మరోపక్క దేశీయంగా మొత్తం డిమాండ్‌లో గ్రీన్ స్టీల్ వాటా 2029-30 కల్లా 2 శాతానికి(4 మిలియన్ టన్నులు) బలపడవచ్చని గ్రీన్ స్టీల్‌పై గిరీ కుమార్ స్పందించారు. ఈ బాటలో 2049-50కల్లా దాదాపు 40 శాతానికి(150 ఎంటీ) కి చేరవచ్చని అంచనా వేశారు. గ్రీన్ హైడ్రోజన్ ధరలు కేజీకి 1.5-1.6 డాలర్లకు క్షీణిస్తేనే గ్రీన్ స్టీల్ తయారీ ఊపందుకుంటుందని తెలియజేశారు. అయితే సమీప భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ ధరలు దిగిరాకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

## డీఎంకే ఈవిల్, టీవీకే ప్యూర్..

# విజయ్ రాజకీయ పునరాగమనం

**తమిళనాడు:** నటుడురాజకీయ నాయకుడు విజయ్ గురువారం మధ్యాహ్నం తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో భారీ ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన తర్వాత రాష్ట్రంలో ఆయన పెద్ద ఎత్తున జరిపిన మీటింగ్ ఇదే కావడం విశేషం. ఈ ర్యాలీ ద్వారా విజయ్ వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు తన ప్రచారానికి స్వరం సిద్ధం చేసుకున్నారు.



విజయ్ మాట్లాడుతూ.. తమిళనాడులో NEET పరీక్ష మినహాయింపు అంశం, శాంతిభద్రతల సమస్యలపై ఆయన డీఎంకేపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎంకే పార్టీకి సమస్యలు ఫెవికాల్‌తో ముడిపడి ఉన్నాయి, వాటిని వేరు చేయలేం అని వ్యాఖ్యానించారు. అధికార డీఎంకేను దుష్ట శక్తిగా, తన పార్టీ TVK (తమిళగ వెట్రి కజగం)ను స్వచ్ఛమైన శక్తిగా అభివర్ణించారు. పోరాటం స్వచ్ఛమైన శక్తికి, చెడుకు మధ్య అని విజయ్ మండిపడ్డారు. ర్యాలీకి వచ్చిన జనసమూహాన్ని సురక్షితంగా వెళ్లమని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ ర్యాలీ మాజీ ఏఐఏడీఎంకే నాయకుడు కేఏ సెంగొట్టయన్ స్వస్థలం విజయమంగళం సమీపంలో జరగడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. సెంగొట్టయన్ గత నెలలో ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన తర్వాత విజయ్ పార్టీ టీవీకేలో చేరారు. ఆయనను సీనియర్ రాజకీయ నాయకుడు, అద్భుతమైన ప్రచార వ్యూహకర్తగా పరిగణిస్తారు. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ నిర్వహించిన రెండవ పెద్ద ఎత్తున బహిరంగ సభ ఇదే కావడం విశేషం. మొదటి సభ గత వారం పుదుచ్చేరిలో జరిగింది, అక్కడ కూడా ఆయన డీఎంకేపై మాటల దాడి చేశారు. ఈరోడ్ ర్యాలీతో విజయ్ తన రాజకీయ యాత్రను మరింత దూకుడుగా కొనసాగిస్తున్నారు. ఈ ర్యాలీతో డీఎంకేపై ప్రత్యక్ష పోరాటానికి సంకేతాలు ఇచ్చారు.


**తోపులాటకు ఆస్కారం లేకుండా..**

తోపులాట, తొక్కిసలాటలకు ఆస్కారం ఇవ్వకుండా లోనికి కేడర్‌ను నిర్ణీత సమయంలోకి అనుమతించడం, నిర్ణీత సమయంలో విజయ్ అక్కడికి వచ్చే విధంగా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ ఏర్పాట్లను టీవీకే వర్కింగ్ కమిటీ సమన్వయకర్త సెంగొట్టయ్యన్, ప్రధాన కార్యదర్శి భుస్సీ ఆనంద్ పర్యవేక్షించారు. గుర్తింపు కార్డులు ఉన్న కేడర్‌ను మాత్రమే లోనికి అనుమతించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా విజయ్ పర్యటనను నిర్వహించారు. గర్భిణిలు, వృద్ధులు, పిల్లలు దయ చేసి ఇక్కడకు రావొద్దని ముందుగానే సూచించారు. రెండున్నర నెలల అనంతరం రాష్ట్రంలో మళ్లీ మీట్ ది పీపుల్ ప్రచార ప్రయాణానికి విజయ్ శ్రీకారం చుట్టనున్నడంతో బయటి వ్యక్తులు ఎవ్వరూ ఈరోడ్‌కు రావొద్దని, విజయ్ వాహనాన్ని వెంబడించ వద్దని టీవీకే కార్యాలయం విన్నవించుకుంది.

# బార్ కౌన్సిల్ ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ:** ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏపీ తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 30 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు న్యాయవాది గుడిమళ్ల సుభాషిణి. ఈ మేరకు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కల్పిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంది. ఈ నెల 20వ తేదీన బార్ కౌన్సిల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, జనవరి 30వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 10వ తేదీన కౌంటింగ్ జరుగనుంది.



# శబరిమల బంగారం చోరీ కేసులో పురోగతి

శబరిమల బంగారం చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) కొంత పురోగతి సాధించింది. ఈమేరకు ఒక ప్రవాస వ్యాపారి వాంగ్మూలాన్ని నమోదు చేయగలిగింది. నిన్న సాయంత్రం బుధవారం(డిసెంబర్ 18) పండలం స్థానికుడైన ప్రవాస వ్యాపారి నుంచి వివరణాత్మక వాంగ్మూలం సేకరించింది సిట్ బృందం. ఆ తర్వాత ఆ సమాచారాన్ని ప్రవాస దర్యాప్తు బృందంతో పంచుకున్నారు. దాంతోపాటు కొంతమంది వ్యక్తుల నంబర్లను కూడా పంచుకున్నారు. ప్రస్తుతం ఆ వాంగ్మూలం ఆధారంగా SIT తదుపరి దర్యాప్తుకు సిద్ధమవుతోంది. ఇటీవల, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితల శబరిమల బంగారు దోపిడీ వెనుక అంతర్జాతీయ పురాతన వస్తువుల స్మగ్లింగ్ ముఠా ఉందని తనకు సమాచారం అందిందని ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఆయన ఇచ్చిన ఫిర్యాదులో నిందితుడిగా ఉన్న దుబాయ్ వ్యాపారవేత్త నుంచి సిట్ గతంలో వాంగ్మూలం నమోదు చేసింది కూడా. దోపిడీలో పాల్గొన్న ఒకరితో తనకున్న వ్యక్తిగత అనుభవాల గురించి ఆ వ్యాపారవేత్త చెప్పాడు కానీ అందుకు సంబంధించి.. ఎటువంటి పత్రాలను ఇంతవరకు అతడు సమర్పించలేదు. ఇదిలా ఉండగా, డిసెంబర్ 6న రమేష్ చెన్నితల సిట్‌కి లేఖ రాస్తూ, బంగారు దోపిడీలో పురాతన వస్తువుల స్మగ్లింగ్ ముఠాకు ఉన్న సంబంధాన్ని దర్యాప్తు చేయాలని, రూ.500 కోట్ల లావాదేవీ జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఆయన సిట్ ముందు హాజరై తన వాంగ్మూలం కూడా ఇచ్చారు. శబరిమల బంగారు దోపిడీలో రాష్ట్రంలోని కొంతమంది పారిశ్రామికవేత్తలు కూడా పాల్గొన్నారని చెన్నితల లేఖలో ఆరోపించారు. అలాగే ఆయన ఆ లేఖలో ఇలా వివరించారు. పురాతన వస్తువులను దొంగిలించి బ్లాక్ మార్కెట్లో విక్రయించే ముఠాల గురించి ప్రత్యక్షంగా తెలిసిన వ్యక్తి నాకు తెలుసు. అతను ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలను వెల్లడించడానికి సిద్ధంగా లేడు. కానీ అతను దర్యాప్తు బృందం, కోర్టు ముందు వచ్చి తన వాంగ్మూలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. స్వతంత్రంగా దర్యాప్తు చేసిన తర్వాత నేను అలాంటి మాటలు చెబుతున్నాను. రాష్ట్రంలోని కొంతమంది పారిశ్రామికవేత్తలకు, ఈ ముఠా రాకెట్లకు బంగారు దొంగతనంతో సంబంధం ఉంది. దేవస్వం బోర్డులోని కొంతమంది ఉన్నత స్థాయి అధికారులకు ఈ రాకెట్‌తో సత్సంబంధాలు ఉన్నాయా లేదా అనేదానిపై దర్యాప్తు చేయాలి. అలాగే పురావస్తు సమూహాలను కూడా దర్యాప్తు పరిధిలోకి తీసుకురావాలి' అని రమేష్ చెన్నితల లేఖలో డిమాండ్ చేశారు.



# జైలర్ 2లో బాలీవుడ్ బ్యూటీ ఐటం సాంగ్!

సినిమాలో ఎంత పెద్ద హీరోలు ఉన్నా ఐటమ్ సాంగ్స్ తప్పనిసరిగా మారుతోంది. కథ, కథనాలు ఎంత బాగున్నా, ఆ చిత్రాలకు ఎక్కువ మైలేజ్ ఇస్తున్నవి ఐటమ్ సాంగ్స్‌నే అంటున్నారు సినీ పండితులు. అలా ఐటమ్ సాంగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లుగా మారిన అతి కొద్దిమంది స్టార్ హీరోయిన్లలో తమన్నా పేరు ముందు ఉంటుంది. రజనీ నటించిన జైలర్ మూవీలో తమన్నా అందాలు ఆరబోసిన నువ్వు కావాలయ్యా పాట ఎంత హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే.

**జైలర్ 2లో ఐటం సాంగ్**

అదేవిధంగా కూలీ చిత్రంలో పూజాహెగ్డే స్టెప్పేసిన మోనికా సాంగ్ కూడా ఈచిత్రానికి కొంత మైలేజ్‌ను తీసుకొచ్చింది. తాజాగా రజనీ నటిస్తున్న జైలర్-2 చిత్రంలోనూ ఐటమ్‌సాంగ్ ఉంటుందని సమాచారం. కాకపోతే ఈ సారి మిల్కీ బ్యూటీ తమన్నాకు బదులుగా బాలీవుడ్ బ్యూటీని ఎంపిక చేసే ప్లాన్‌లో ఉన్నారట! ఆమె ఎవరో కాదు నోరా ఫతేహి.

**స్టెప్పేయనున్న నోరా ఫతేహి?**

మోడలింగ్ రంగంలో రాణించిన ఈ క్రేజీ భామ హిందీ బిగ్‌బాస్ రియాలిటి గేమ్‌షోలోనూ పాల్గొంది. అనంతరం పలు హిందీ చిత్రాల్లో నటిస్తున్న ఈ బ్యూటీ బాహుబలి వంటి కొన్ని చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో నటించి గుర్తింపు పొందింది. ఇప్పుడు జైలర్-2 మూవీలో ఐటమ్ సాంగ్ చేయనుందని తెలుస్తోంది. ఈ విషయంపై క్లారిటీ రావాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే!



# దారుణంగా ట్రీట్ చేశారు

బాలీవుడ్ బ్యూటీ రాధికా ఆప్టే ఇండస్ట్రీలో అడుగుపెట్టి 20 ఏళ్లవుతోంది. 2005లో వచ్చిన కామెడీ ఫిలిం 'వాహ్ లైఫ్ ఓతో ఐసీ'తో వెండితెరపై ఎంట్రీ ఇచ్చింది. తర్వాత అనేక సినిమాలు, సిరీస్‌లు చేసింది. రెండు దశాబ్దాలుగా టాలెంటెడ్ నటిగా సినీరంగంలో రాణిస్తోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది.

## చేదు అనుభవం

రాధికా ఆప్టే మాట్లాడుతూ.. అందరూ తమ ఫస్ట్ సినిమా గురించి మంచిగా చెప్పకుంటారు. కానీ, నాకు మాత్రం నా ఫస్ట్ మూవీ భయానక అనుభవాలనే పంచింది. నిర్మాత (సంగీత అహిర్) నాకు సరైన వసతి కల్పించలేదు, డబ్బులివ్వలేదు. నేను, అమ్మ.. వారిని సినిమా రెమ్యునరేషన్‌కు సంబంధించిన కాంట్రాక్టుపై సంతకం చేయమన్నాం.

## దారుణంగా..

కానీ, వాళ్లేమో.. ఊర్మిళ వంటి పెద్ద నటియే ఏ హామీ అవసరం లేదంది.. మీరేంటి ఇలా అడుగుతున్నారు? అని దాటవేశారు. అదెంతవరకు నిజమో నాకు తెలియదు కానీ మమ్మల్ని మాత్రం చాలా దారుణంగా ట్రీట్ చేశారు. అందుకే నా ఫస్ట్ సినిమాను ఎప్పడూ మర్చిపోవాలనుకుంటాను అని తెలిపింది..

## ఆయనే న్యాయ నిర్ణేత

సినిమాలో తొలి అవకాశం ఎలా వచ్చిందన్నదాని గురించి మాట్లాడుతూ.. నేను బ్రెయిన్ సర్జన్ అనే నాటకం వేశాను. మా టీమ్‌కు రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చింది. అయితే మాకు అవార్డు ఇచ్చిన జడ్జి టీమ్‌లో దర్శకుడు మహేశ్ మంజ్రేకర్ ఉన్నారు. నాటకం అయిపోయిన వెంటనే నన్ను పిలిచి సినిమా ఛాన్స్ ఇస్తానన్నాడు. అలా ఆయన డైరెక్షన్‌లోనే తెరంగేట్రం చేశాను. చూస్తుండగానే 20 ఏళ్లు గడిచిపోయాయి అని నటి చెప్పకొచ్చింది.

## సినిమాలు

రాధికా ఆప్టే తెలుగులో రక్త చరిత్ర, లెజెండ్, లయన్ చిత్రాల్లో నటించింది. తెలుగు, హిందీతో పాటు ఇంగ్లీష్, మరాఠి, బెంగాలీ, తమిళ సినిమాల్లోనూ యాక్ట్ చేసింది. మేడ్ ఇన్ హెవెన్, సేక్రెడ్ గేమ్స్, ఓకే కంప్యూటర్ వంటి వెబ్ సిరీస్‌లలోనూ నటించింది. చివరగా సాలి మొహబ్బత్ అనే థ్రిల్లర్ సినిమాలో కనిపించింది. ఈ మూవీ ప్రస్తుతం జీ5లో అందుబాటులో ఉంది.

# 8 ఏళ్ల తర్వాత పార్టీ ఇవ్వనున్న రెజీనా, రమ్యకృష్ణ



తమిళసినిమా: ఒక్కోసారి అనుకున్నది అనుకున్నట్లు జరగదు. అందుకు పలు కారణాలు ఉంటాయి. ఇది చిత్రాలకు అతీతం కాదు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకున్నా, కొన్ని చిత్రాల విడుదలకు ఏళ్ల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. ఉదాహరణకు మదగజరాజానే తీసుకుంటే నిర్మాణం పూర్తి చేసుకుని పలు అవరోధాలను ఎదురొడ్డి 12 ఏళ్ల తరువాత తెరపైకి వచ్చింది. విశాల్ హీరోగా నటించిన ఈ చిత్రానికి సుందర్.సీ దర్శకుడు అయినప్పటికీ ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అలాంటి మ్యాజిక్ పార్టీ చిత్రానికి వర్కౌట్ అవుతుందా? అన్నదే ఇప్పుడు జరుగుతున్న చర్చ. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహించిన చిత్రం పార్టీ.. మిర్చి శివ, జయ్, రెజీనా, రమ్యకృష్ణ, నివేదాపేతురాజ్, జయరామ్, సత్యరాజ్ వంటి ప్రముఖ నటీనటులు నటించిన ఈ చిత్రానికి ప్రేమ్‌జీ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం 8 ఏళ్ల క్రితం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. అయితే ఆర్థిక సమస్యల కారణంగా ఇప్పటికీ తెరపైకి రాలేదు. మధ్యలో చిత్ర వర్గాలు చాలా ప్రయత్నాలు చేశారు. తాజాగా పార్టీ చిత్రాన్ని తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ప్రథమార్థంలో పార్టీ తెరపైకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వెంకట్‌ప్రభు చిత్రాలకు కాలంతో పనిఉండదు. ఎంటర్‌టెయిన్‌మెంట్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి పార్టీ చిత్రం కూడా సక్సెస్ అవుతుందని భావిద్దాం.



# శ్రీలీల మాత్రమే కాదు.. నివేదా థామస్ కూడా.!

టెక్నాలజీ అనేది మంచి కోసం ఉపయోగించాలి. అదేంటో సాంకేతికత పెరిగేకొద్ది మనిషి బుద్ధి మాత్రం గాడి తప్పతోంది. మరీ ముఖ్యంగా ఏఐ వచ్చాక విపరీతమైన ధోరణి మరింత పెరిగిపోయింది. ఎవరు పడితే వాళ్లు ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. మరీ ముఖ్యంగా సినీతారలనే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. రష్మిక, కాజోల్, కీర్తి సురేశ్ లాంటి స్టార్స్ వీటి బారిన పడిన వారిలో ఉన్నారు. తాజాగా లిస్ట్‌లో శ్రీలీల కూడా చేరిపోయారు. ఏఐ టెక్నాలజీతో నా ఫోటోలు అసభ్యంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని కన్నడ బ్యూటీ వాపోయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ నోట్ షేర్ చేసింది. ఏఐతో చేస్తున్న చెత్తను ఎవరూ సపోర్ట్ చేయొద్దని చేతులు జోడించి ప్రాధేయపడుతున్నానని తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే తాజాగా మరో హీరోయిన్ నివేదా థామస్ సైతం తాను కూడా ఏఐ బాధితురాలినేని ట్వీట్ చేసింది. ఏఐతో తన ఫోటోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందని తెలిపింది. నా అనుమతి లేకుండా అలాంటి కంటెంట్ సృష్టించడం నన్ను తీవ్రంగా కలిచివేసిందని వెల్లడించింది. ఇది నా వ్యక్తిగత గోప్యతపై జరిగిన దాడి అని నివేదా థామస్ ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే నా ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా ఖాతాల నుంచి తీసివేయాలని ఆదేశించింది. ఎవరైనా ఇలాంటి కంటెంట్‌ను గుర్తిస్తే.. వాటిని ఎవరికీ కూడా షేర్ చేయవద్దని నివేదా కోరింది. అనవసరమైన వాటిని షేర్ చేసి ఇబ్బందుల్లో పడొద్దని.. ఉద్దేశపూర్వకంగా దుర్వినియోగానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని నివేదా థామస్ స్వీట్ వార్నింగ్ ఇచ్చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com